ప్రజాశక్తి

Vol. 1, no. 4

(Jul. 8, 1942)

బెజవాడ, 1942

Prajāśakti

Vol. 1, no. 4

(Jul. 8, 1942)

Bejavāḍa, 1942

Record no. 683

10 పేజీలు: 0-1-6 PRAJA SAKTI Regd. No. M. 4486.

చందావివరాలు	
సం॥ చందా	4-0-0
అర్ధసం॥ ,,	2-0-0
విడిప్రతి	0-1-6

ప్రజాశక్తి

అడ్వర్ టైజుమెంటు రేట్లు	
పూర్తిపేజి	35-0-0
అరపేజి	18-0-0
పావుపేజి	10-0-0
కాలం అంగుళం	0-12-0

రాజకీయ వారపత్రిక

సంపాదకుడు: కాట్రగడ్డ రాజగోపాలరావు. సంపాదకవర్గం: చలసాని వాసుదేవరావు, తుమ్మల వెంకటరామయ్య, కొండేపూడి లక్ష్మీనారాయణ

సంపుటి 1 | బుధవారం 8-7-1942 బెజవాడ | సంచిక 4

మన రాజకీయాలు

వైస్రాయి ఎగ్జిక్యూటివ్‌కౌన్సిలు విస్తరించబడింది. మరో మూడుబొమ్మలు తెరమీద కెక్కించబడ్డాయి. అంటే వైస్రాయి కౌన్సిలు సభ్యులసంఖ్య 12 గురు నుంచి 15 గురుకు పెంచబడింది. ఈ విస్తరణ యుద్ధపరిస్థితుల వల్ల, ఏర్పడిన అధికబాధ్యతలను నిర్వర్తించడానికి, దేశరక్షణను యుద్ధప్రయత్నాలను బలపర్చడానికి చేయబడిందని ప్రభుత్వం ప్రకటించింది. డిఫెన్సు శాఖను యుద్ధమంత్రి నుండి విడదీశారు. ఆ డిఫెన్సుమంత్రి బాధ్యత లేమిటో కూడ ప్రకటించారు. సిక్కుల కొకస్థానమూ, నిమ్నజాతుల కొకస్థానము ఇవ్వబడ్డాయి.

అయితే ఈ విస్తరణపట్ల దేశంలో వివిధ రాజకీయపార్టీల, పక్షాల అభిప్రాయాలేమిటి? దీనివల్ల ప్రభుత్వం ప్రకటించిన ఆశయాలు ఎంతవరకు నెరవేరుతాయి? అని పరిశీలించడం అవసరం.

ఈ విస్తరణ దేశంలో ఏ వర్గాన్ని కూడ సంతృప్తిపరచలేదు.

ఈనెల 5 వ తేదీని జరిగిన నేషనల్ లిబరల్ ఫెడరేషను, సాంవత్సరిక సమావేశంలో తన తీర్మానంలో ఇలా ప్రకటించింది.

"జూలై 2 వ తేదీని ప్రకటించబడిన వైస్రాయి కౌన్సిలు విస్తరణ దేశంలో యుద్ధప్రయత్నాలకు కావలసిన సహాయాన్ని సంపాదించడానికి అవసరమైన వాతావరణం సృష్టించజాలదు. ఈ విషయంలో అది పూర్తిగా విఫలమైంది. యుద్ధమంత్రి నుండి డిఫెన్సు మంత్రిని వేరుచేసి ఆ పదవి భారతీయుని కిచ్చారు. కాని ఆ డిఫెన్సు మంత్రి కిచ్చిన అధికారాలు, బాధ్యతలు ప్రధానమైనవి కావు. అవి రెండోరకపు అధికారాలు మాత్రమే.

కేంద్రములో జాతీయ ప్రభుత్వం ఏర్పరచడం ద్వారా దేశంలో ప్రస్తుతమున్న మానసిక తత్వాన్ని పూర్తిగా మార్చివేస్తేగాని, యుద్ధనిర్వహణకు రావలసినంత సహాయం రాదు."

ఇండియన్ మర్చంటుస్ ఛేంబరు అధ్యక్షుడు. జె. సి. సెతల్వాడ్ తన ప్రకటనలో ఇలా చెప్పాడు.

"ఇప్పుడున్న ప్రమాద పరిస్థితులను ప్రభుత్వం గుర్తించకపోవడం చాల విచారకరం.........బ్రిటను భారతదేశం, ఉభయుల శ్రేయస్సుకోసం యుద్ధ ప్రయత్నాలు సఫలీకృత మయేటట్లు చేయాలంటే, ఇప్పుడు ఏర్పరచిన కేంద్ర ప్రభుత్వం లాంటిది పనికిరాదు. ....ఇది "జాతీయ" ప్రభుత్వం కానే కాదు..........ప్రభుత్వం పూర్తిగా మరో జాతీయ కేంద్ర ప్రభుత్వాన్ని నెలకొల్పాలి."

ఇంక ఈ మార్పులు, జాతీయ వాదులను అసలే సంతృప్తి పరచడం లేదని వేరే చెప్పనక్కరలేదు. జాతీయ పత్రికలన్నీ తీవ్ర అసంతృప్తినే ప్రకటించాయి.

ప్రభుత్వం ప్రకటించిన ఆశయం నిజంగా నెరవేరాలంటే ప్రజలు ఈ యుద్ధాన్ని తమ యుద్ధంగా భావించి, హృదయ పూర్వకమైన సహకారంచేసి,ఫాసిస్టులదాడినివిజయవంతంగా అరికట్టడానికి, దేశరక్షణకు తోడ్పడాలంటే ప్రజాదరణను చూరగొనే నిజమైన ప్రజాప్రతినిధులు గల జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పరచాలి. ఆప్రభుత్వానికి దేశరక్షణకు కావలసినసంపూర్ణ అధికారాలు ఇవ్వాలి. అట్టిజాతీయ ప్రభుత్వమే ప్రజలను ఉత్తేజ పర్చగలుగుతుంది. అపారమైన ప్రజా సహాయాన్ని పొంద గల్గుతుంది. యుద్ధప్రయత్నాలు వేయిరెట్లు విజయ వంతమౌతాయి. పైగా ప్రభుత్వం ఇప్పుడు కొత్తగా తీసుకున్న సభ్యులు దేశంలో ఏమాత్రం పలుకుబడి, గౌరవం లేనివారు. ప్రజలచే అసహ్యించుకోబడేవారు. ఉదాహరణకు సర్ సి. పి. రామస్వామి అయ్యరుగాడు 1935 నుంచి తిరువాన్కూరు దివాన్ గిరి చేస్తూ ప్రజలను నానా బాధలుపెట్టి యేడ్పించిన పుణ్యాత్ముడు.

జామ్ సాహెబ్‌గారు మధ్య యుగంనాటి నిరంకుశ పాలకులను ప్రతిబింబించే సంస్థానాధీశుడు, ఇట్టివారికి జాతీయ రక్షణ అప్పజెప్పడం వలన వచ్చే మంచికంటెచెడుగే ఎక్కువ వుంటుంది. ప్రజలు యుద్ధ కృషికి తోడ్పడక పోగా వ్యతిరేకులు కూడా అవుతారు.

★ ★ ★

దీనికి తోడు ప్రభుత్వం, జాతీయ శక్తులపై తన తెలివితక్కువ నిర్బంధ విధానాన్నింకా మానుకోలేదు. ఒరిస్సా మాజీ ప్రధాని విశ్వనాథ్‌దాసును అరెస్టు చేసింది. ఈ అరెస్టును నిరశిస్తూ అజాద్ రాజేంద్రబాబులు ప్రకటనలు చేశారు. ఇక్కడఇది, అక్కడ పార్లమెంటులో ఇండియా కార్యదర్శి అమెరీతన తలతిక్క సమాధానాలు కట్టిపెట్టలేదు. ఇండియా సమస్యపై వచ్చిన ప్రశ్నలకు సమాధానమిస్తూ "ఇప్పట్లో భారత దేశానికి ఇంతకంటెఎక్కువ ఏమీరాదు పొమ్మ"న్నాడు. ఈ చర్యలన్నీ జాతీయ శక్తులను, దేశరక్షణ, యుద్ధ నిర్వహణ కార్యాలకు మరింత దూరం చేయడానికి దోహదమిస్తాయి. ఫాసిష్టు యుద్ధంలో క్షతగాత్రుల సహాయార్థం తన రక్తాన్ని కలకత్తా రక్తనిధికి (బ్లడ్‌బ్యాంకుకు) దానం చేయడానికి ఇష్టపడిన నెహ్రూలాంటి నిజమైన ఫాసిష్టు వ్యతిరేకి కూడ ఈ చర్యలు చూచి ఈ నెల 3 వ తేదీన గోరఖ్‌పూరులో ఒక బహిరంగ సభలో మాట్లాడుతూ ఇలా అన్నాడు.

"భారత స్వాతంత్ర్య సంపాదనకు గాంధీజీ తన సత్యాగ్రహోద్యమాన్ని ప్రారంభించబోతున్నాడు. మీరంతా సంసిద్ధులుగా వుండాలి,"

"........ముందర మన భారత దేశానికి స్వాతంత్ర్యం రావాలి, ఆ తరువాత జపానును గాని, మరి యే యితర శత్రువును గాని ఎదుర్కొంటాము"

అంతటికిత్రితం రోజుననే (జూలై 2) వల్లభాయి పటేలు సూరత్‌లో ఉపన్యసిస్తూ, "మహాత్ముని వ్రాతలనుబట్టి చూస్తే ఆయన తన ఉద్యమం రేపే ప్రారంభించినా ప్రారంభించవచ్చు. మీటింగులతోను, ఉపన్యాసాలతోను గడపవలసిన సమయం కాదిది. నేను మరల మిమ్ములను కలుసుకుంటానో, లేదో కూడ చెప్పలేను, మీరంతా గాంధీజీ పిలుపుకు సిద్ధంగా వుండాలని" హెచ్చరించాడు.

సరిహద్దులో అబ్దుల్ గఫూర్‌ఖాన్ గూడ రెడ్ షర్టు వాలంటీర్లకు, "మన దేశ స్వాతంత్ర్యంకోసం విప్లవం రాబోతూ వుంది. మీరంతా సిద్ధంగా వుండాలి" అని ప్రబోధించాడు.

★ ★ ★

ఇక్కడ మనం ఒక్క విషయం గమనించాలి. ఈ ప్రకటనలన్నీ కాంగ్రెసు వర్కింగు కమిటీ సమావేశం కాబోయేముందు గాంధీజీ తన నూతన సత్యాగ్రహోద్యమాన్ని గురించి నెహ్రూ, అజాద్‌లతో దీర్ఘ చర్చలు జరిపిన తరువాతను వెలువడ్డాయి.

ఇప్పుడు (జూలై 8 వ తేదీనుండి) సమావేశమౌతున్న కాంగ్రెసు వర్కింగు కమిటీ వివరాలు యింకా తెలియలేదు. అయినప్పటికీ ఈసమావేశం మన దేశ చరిత్రలో చాల ప్రాముఖ్యమైనది మాత్రం కాగలదు. ఈ సమావేశంలో గాంధీజీ తన ప్లానును చర్చకు పెడతాడు, బ్రిటిషు ప్రభుత్వం నుండి భారత దేశానికివెంటనే స్వాతంత్ర్యంరావాలనే గాంధీజీ కోరికను యెవరూ వ్యతిరేకించరు, అయితే ఆ స్వాతంత్ర్యం ప్రస్తుత ఫ్యాసిస్టు వ్యతిరేక యుద్ధ ప్రయత్నాలకు సాయం చేయకుండా ప్రభుత్వంపై పోరాటం సాగించడం ద్వారా వస్తుందంటాడు గాంధీజీ. దేశంలోని కమ్యూనిస్టులు, కార్మిక వర్గం, అఖిల భారత రైతు మహాసభ, విద్యార్థులు, యువకులు, యితర ఫాసిస్టు వ్యతిరేకులు అందరూ గాంధీజీ సూచించే పంథా సరియైనది కాదని ప్రకటించుతున్నారు. నేడు మన కార్యక్రమం, ప్రస్తుత యుద్ధ ప్రయత్నాలకు యేవిధంగానైనా అడ్డు తగిలేదిగాను, నష్టం కలిగించేదిగాను వుంటే అదిమనస్వాతంత్ర్యానికి దారి తీయదు. అది జపాను ఆక్రమణకు పంచమాంగ దళంవారికి తోడ్పడుతుంది.

జాతియైక్యతకు దారితీసేదిగాను వుండదు, అది మన జాతీయ శక్తులను, జాతీయ ఐక్యతను తద్వారా స్వాతంత్ర్యపోరాటాన్ని బలహీనపర్చేదిగా మాత్రమే తయారవుతుంది,

కాన మన కార్యక్రమం యుద్ధప్రయత్నాలను ప్రజాయత్తపర్చేదిగానూ వాటిని పెంపొందింపజేయడంలో ప్రభుత్వం పెట్టే అడ్డంకులను అవలంబించే సంకుచిత విధానాన్ని తొలగించేదిగాను వుండాలి.

కాంగ్రెస్ వర్కింగుకమిటీ ఈ ప్రమాదాన్నుంచి దేశాన్ని కాపాడడానికి ప్రజలు కోరే కార్యక్రమాన్నిచ్చి జాతీయ ప్రభుత్వ సంపాదనకు, దానికి ప్రపంచ ప్రజల సహాయాన్ని బలాన్ని సంపాదించడానికి ఒకడుగు ముందుకు వేస్తుందని ఆశిస్తున్నాము. (7-6-42)

నిర్బంధాల రద్దు

ఈ క్రిందివారిపై డిటెన్షన్ ఆర్డర్లు రద్దు కొబడినాయి.

మద్దుకూరి చంద్రశేఖరరావు, చంద్ర రాజేశ్వరరావు. కె. ముత్తియన్, ఆర్. సంతానం.

★

మరికొందరు డెటెన్యూలు విడుదల అయ్యారు. యం. ఆర్. వెంకట్రామన్, బి శంకరయ్య. జి. రాధకృష్ణమూర్తి, యం. యస్, మని, ఎ. యస్. కృష్ణమూర్తి, మరి యిద్దరూ విడుదల అయ్యారు. మొన్ననే డెటిన్యూలుగా తీసుకోబడిన రామయ్య, కంభంపాటి సత్యనారాయణ (జూనియర్) విడుదల అయ్యారు.

★

కామ్రేడ్ మహీధర కృష్ణమోహన్ అప్పీల్‌లో, ఇదివరలో అనుభవించిన శిక్షచాలునని విడుదల చేయబడ్డారు. (కూలి, పని, పెట్టుబడి - సోషలిజం, చారిత్రాత్మక సిద్ధాంతం అను గ్రంథాలు ముద్రించినందుకు శిక్షింపబడ్డారు.)

ప్రజాశక్తి

8-7-42 బుధవారం

చల్లపల్లి అరెస్టులు

చల్లపల్లి ఎస్టేటులో జులై 1 వ తేదీ, 2 వ తేదీన చల్లపల్లి, మంగళాపురం గ్రామాల్లో 30 మంది వ్యవసాయ కూలీలను చల్లపల్లి పోలీసులు అరెస్టుగావించడం, వారిని చల్లపల్లి లాకప్‌లో బాధపెట్టడం గూర్చి వేరొక చోట ప్రకటింపబడింది. అరెస్టుగావించబడిన వారిలో కృష్ణాజిల్లా వ్యవసాయ కూలీ సంఘ ఆర్గనైజరుగావైన చల్లపల్లి నారాయణరావుగారు గూడ వున్నారు. వీరందరినీ అవనిగడ్డ జైలులో బంధించిన తదుపరి చూడడానికి గూడ యెవరికీ పర్మిషన్ యివ్వ నిరాకరించారు.

వీరు గావించిన నేరం మంగళాపురంలో వీ రిదివరకునుండి పండించుకుంటూ అనుభవిస్తువున్న బంజరు భూములను తిరిగి ఎస్టేటువారు, అక్రమముగా లాక్కోవడానికి గావించిన ప్రయత్నాలను తమ భుక్త హక్కును నిలబెట్టుకోవడానికి శాంతియుతంగా ప్రతిఘటించుటే. మంగళాపురం ముత్రాసులు 1938 వ సంవత్సరం నుండీ అచ్చటి అరణ్య భూములను ఎస్టేటువారి అనుమతిమీదనే, వారు యెకరం 1 కి 8—0—0 శిస్తు చెల్లిస్తూ పండించుకుంటున్నారు. వాటిని తిరిగి లాక్కోవడానికి యత్నించడం చాల ఘోరము. దానికి విచక్షణా రహితంగాను, అన్యాయంగాను, చల్లపల్లి పోలీసులు మద్దతు పోవడం నిరపరాధులైన ముత్రాసులను అరెస్టు చేయడం, వారిపై దౌర్జన్యం యెస్టేటు నౌకర్లతో కలసి చేయడం చాల అక్రమము గర్హ్యనీయము.

చల్లపల్లి గ్రామములోని వ్యవసాయ కూలీలు అచ్చటి బంజరు భూములను తాము పండించుకోవడానికి యివ్వమని తమ కూలీ సంఘం ద్వారా ఆందోళన యెప్పటినుండో చేస్తున్నారు. ఎస్టేటువారికి బందరు కలెక్టరుగారికి వాటిని తమకిప్పించమని దరఖాస్తు గూడా చేశారు. వారికి ఆ భూములు సాగుకు లభించకపోతే భుక్తికే కష్టతరమౌతుంది. అట్టి వారి కోర్కెలను సరకుజేయక అధిక లాభాలకొరకు యెస్టేటువా రా భూముల నితరుల కివ్వజూచుట యేమి సమర్థనీయం గాదు. ఈ సందర్భంలో చల్లపల్లి వ్యవసాయ కూలీలు యెన్నాళ్ళనుండో అచ్చటి బంజరు భూములను తమకే సాగుచేసుకోవడానికి వదలిపెట్టాలనియు, యితరు లెవ్వరిని ఆ ప్రదేశంలో యెస్టేటువారు ప్రవేశపెట్టరాదనే వారి కోర్కె ఆక్షేపణీయమైన దేమిగాదు.

ఇటీవల మద్రాసు ప్రభుత్వం సాగులో లేని బంజరు భూములను శిస్తు లేకుండా పేద రైతులు, వ్యవసాయ కూలీలు సాగుచేసుకోవడానికి అనుమతిస్తూ యొక ప్రకటన చేసింది. దాని సారాంశమిది.

1349, 1350 ఫసలీలో సాగు చెయ్యబడని పన్ను విధించబడిన అనాక్రమిత భూములను, పన్ను విధించబడని లేక అడవులు కొట్టబడిన భూములను 1352, 1353, 1354 ఫసలీలలో పన్ను లేకుండా సాగు చేసుకొనుటకై అనుమతి యివ్వవచ్చును. ఆ ఫసలీలలో రైతు ఆ భూములపై శ్రమపడి, ధనం వ్యయం చేసివుంటారు కనుక అటుతరువాత కూడా ఆ భూమినుండి అతనిని తొలగించకుండుటకై యేర్పాట్లు గావించాలి. ఇట్టి భూములపై ఆహార దినుసులు మాత్రమే పండించాలి, ఇదివరకు సాగులో లేని కృష్ణా, గోదావరి డెల్టాల ఆయకట్టుల క్రింది భూములను ఇంక్లూజన్ ఫీజు లేకుండా సాగు చేయడానికి యివ్వవచ్చును. యుద్ధ కాలములో మన రాజధానిలో యేర్పడ్డ ఆహారోత్పత్తి కొరతను భర్తీ చేయడం, ఆహార పదార్థాలను విరివిగా పండించేటట్లు ప్రోత్సహించడం, పై ప్రభుత్వ ప్రకటన వుద్దేశ్యం.

చల్లపల్లి ఎస్టేటు వారు వారికి మద్దతు పోయిన చల్లపల్లి పోలీసులు మంగళాపురంలోను, చల్లపల్లిలోను గావించిన అక్రమచర్యలు ఆహార దినుసుల నుత్పత్తి నభివృద్ధి గావించాలనే మద్రాసు ప్రభుత్వ ముఖ్యోద్దేశ్యమునకే హానికరంగా వున్నాయి. ఆహార దినుసులను పండించు కొంటూ భుక్తిని గడుపుకొనే పేద వ్యవసాయ కూలీలను తొలగించి మంగళాపురం, చల్లపల్లి బంజరు భూములలో అధిక లాభాల కొరకు యే వర్తక సరుకులనో (పుగాకు, వేరుశనగ వగైరా) వుత్పత్తి గావించే ధనికులను ధనాపేక్షతో ఎస్టేటు వారు ప్రవేశపెట్టడానికి గావించే ప్రయత్నాలను ప్రభుత్వదృష్టితో చూచినా సమర్థనీయములుగావు. వ్యవసాయ కూలీల దృష్టితో చూచిన మంగళాపురం ముత్రాసుల, చల్లపల్లి వ్యవసాయ కూలీల కోర్కెలు కడు సమంజసమైనవి. అందుచే కృష్ణాజిల్లా కలెక్టరు యీ విషయంలో జోక్యము గలుగజేసుకోవాలి. చల్లపల్లి యెస్టేటువారిచేత మంగళాపురంలోని అరణ్య భూములను అచ్చట యిదివరకు వాటిని అనుభవిస్తున్న 70 మంది ముత్రాసు కుటుంబాలకు జిరాయితీ హక్కుతో యిప్పించాలి; చల్లపల్లి గ్రామములోని బంజరు భూములను అచటి వ్యవసాయ కూలీలకే ప్రభుత్వ బంజరు భూముల గూర్చి గావించిన ప్రకటనలోని షరతులకే సాగుకు యిప్పించాలి. అరెస్టు గావించబడిన వారందరినీ యెట్టి షరతులు లేకుండా విడుదల గావించాలి. కూలీలపై అకారణంగా దౌర్జన్యం గావించిన ఎస్టేటు వుద్యోగులను డిస్మిసు చేయించాలి. వారికి తోడ్పడిన చల్లపల్లి పోలీసు వుద్యోగులపై తగిన చర్య గైకొనాలి.

బాలిరెడ్డిగారు అప్రధాన సమస్యను ముందుకు తెస్తున్నారు.

కామ్రేడ్ చలసాని వాసుదేవరావు

ఆంధ్రరాష్ట్ర రైతు సంఘ కార్యదర్శిగావైన చేగిరెడ్డి బాలిరెడ్డిగారు జూన్ 25 వ "ఆంధ్రప్రభ"లో ప్రకటనగావిస్తూ "ఇండియాకు సంబంధించినంత వరకు యిది ప్రజాయుద్ధము కానేరదని బిహటా అఖిలభారత రైతు సభ వారిచే బలపర్చబడ్డ నాగపూరు తీర్మానాలు చెప్పుచున్నాయి. దేశరక్షణశాఖపై సంపూర్ణ అధికారం కలిగి, కేంద్రములో, రాష్ట్రాలలో యేర్పడిన జాతీయ ప్రభుత్వ నాయకత్వము క్రింద జరిగిన పోరాటమే ప్రజాయుద్ధమనిపించుకొనుననని ఆ తీర్మానం స్పష్టీకరిస్తున్నది. కనుక రైతు సంఘాలుగాని, రైతు సభలలోగాని యిది ప్రజాయుద్ధమను సిద్ధాంతాన్ని ప్రచారం చేయకూడదు." అని చెప్పారు. అంతేగాకుండా అన్ని జిల్లా సంఘాలకు ప్రజాయుద్ధ మని ప్రచారం చేయరాదనియు, అలా చేసే వాటిపైన, వ్యక్తులపైన చర్యగైకొంటామంటూ హెచ్చరిస్తూ సర్క్యులర్లుగూడ పంపారు.

బాలిరెడ్డిగారి పై ప్రకటనను పూర్తి అర్థం చేసుకోవాలంటే బిహటా కిసాన్ మహా సభచే ఆమోదింపబడ్డ పై తీర్మానము యే పరిస్థితులలో చేయబడిందీ తెలుసుకోవాలి. అ. భా. కిసాన్ కమిటీలో స్వామిసహజానంద ఇందూలాల్ యాగ్నిక్ వారి అనుచరులు, కమ్యూనిష్టులుకలిసి అత్యధిక సంఖ్యాకులుగా వున్నారు. స్వామి సహజానంద, ఇందులాల్‌యాగ్నిక్‌లు గూడ యిది ప్రజా యుద్ధమనే విశ్వసిస్తున్నారు. అ. భా. విద్యార్థి సభలోను, బిహటా కిసాన్ మహాసభ అధ్యక్షోపన్యాసములోను, వెలిబుచ్చిన అభిప్రాయములే యిందుకు తార్కాణము. అల్ప సంఖ్యాకులుగా వున్న ఆచార్యరంగా, వారి అనుచరులు యిది భారత దేశానికి సంబంధించినంతవరకు ప్రజా యుద్ధం యింకా కాలేదని విశ్వసిస్తూ వున్నారు. ప్రజా యుద్ధం అవునా కాదా అనే సమస్య అప్రధానమగుటచేత అధిక సంఖ్యాకులుగా వున్న వారు కిసాన్ సభ ఐక్యతను కాపాడడానికి యీ క్లిష్ట పరిస్థితుల్లో పై తీర్మానాన్ని గావించారు.

ఈ తీర్మానముతోపాటు యింకా చాలా ప్రాముఖ్యమైన తీర్మానాలు గావించారు. జపాన్ ఫాసిస్టులనుండి భారత దేశాన్ని రక్షించుకోవడానికి జపాన్ వ్యతిరేక పోరాటము, ఆందోళన ప్రతి గ్రామ గ్రామాన కొనసాగించడానికై రైతు సంఘాలు, కిసానులు పూనుకోవాలనియు జాతీయ రక్షణ జయప్రదంగా కొనసాగించుటకు గాను జాతీయ ప్రభుత్వాన్ని సత్వరంగా సంపాదించాలనియు, అందుకుగాను జాతీయైక్యతను (కాంగ్రెసు - లీగ్ ఐక్యత) సాధించడానికి తీవ్రకృషి గావించాలనియు, మొదలగు విషయాలను గూర్చి రైతు లందరిని హెచ్చరిస్తూ 10 వ తీర్మానంలో చెప్పబడింది. ప్రజా యుద్ధం అవునా కాదా అనే అప్రధాన సమస్యనుగాక రైతు లందరూ జపాను ఫాసిస్టుల దాడినుండి దేశాన్ని రక్షించుకోవాల్సిన అవసరాన్ని విధానాన్ని రైతులకు స్పష్టంగా తెలియజెప్పడం, ఐక్యతతో ఆ ఆశయాన్ని సాధించడం, ప్రధాన విషయం అని బిహటా కిసాన్ సభలో నాయకుల వుపన్యాసాలు, తీర్మానాలు తెలియపర్చాయి.

ఈ పర్థితుల్లో బాలిరెడ్డిగారు ప్రజాయుద్ధం అవునా కాదా అనే అప్రధాన సమస్యకు ప్రాధాన్యత యివ్వడం, ఆ సమస్యతోనే కిసాన్ వుద్యమము, దానిలో పనిచేసే వర్కర్ల నిజాయితీనే, క్రమ శిక్షణను పరీక్ష చేయడానికి పూనుకోవడం బిహటా కిసాన్ సభ ఉద్దేశ్యానికే వ్యతిరేకం. కేవలం కిసాన్ వుద్యమ ఐక్యతనుచెడకుండా వుంచుటకుగాను ప్యాసుగావించిన పై తీర్మానాన్ని ఆధారంగాజేసుకొని మెకానికల్‌గా క్రమశిక్షణను క్రింది సంఘాలపైరుద్దబోవడం అసలుకిసాన్ వుద్యమ ఐక్యతను నాశనము చేయ డానికి దారితీస్తుంది. వుద్యమాన్ని బలహీనపర్చడం అవుతుంది. ఇంత మాత్రాన క్రింది సంఘాలు యిది ప్రజాయుద్ధమనే ప్రచారాన్ని చేయమని నావుద్దేశ్యంకాదు. క్రింది సంఘాలు గూడ అప్రధానమైన సమస్యను యిప్పుడు లేవదీసి కిసాన్ వుద్యమములో లేనిపోని కలతలు, ఐక్యతా విచ్ఛిన్నత యేర్పరచకూడదు. కిసాన్ సభలోని వారందరూ ఏకీభవించిన కార్యక్రమముపై, జపాన్ వ్యతిరేక పోరాటానికి కిసానులను సంసిద్ధులను చేయడంపైన దేశరక్షణ కార్యాలను (ఎ. ఆర్. పి. ప్రజారక్షణ సంఘాలు, ప్రజారక్షణ శిబిరాలను యేర్పాటు చేయడం వగైరా) బలపర్చడంపైన తమ శక్తినంతా కేంద్రీకరించాలి. ఇలాచేయడం ద్వారానే కిసాన్ వుద్యమములోని ఐక్యతను నిలబెట్టగల్గుతాము; వుద్యమాన్ని ముందుకు తీసుకుపోతాము. ప్రజాయుద్ధము అవునా కాదా అనే అప్రధాన సమస్యను ముందుకు గొనివచ్చి దాని నాధారముగా గొనే క్రమ శిక్షణను అమలు జరుపడం కిసాన్ వుద్యమములోవున్న విభేదాలను మరింత హెచ్చు చేయడమేనని బాలిరెడ్డిగారు గుర్తించాలని కోరుచున్నాను.

ఇప్పటి క్లిష్ట పరిస్థితులలో అందరమూ జాతీయైక్యత కొరకు యెంతో పాటుపడవలసిన తరి, యిట్టి వివాదకరమైన అప్రధానమైన సమస్యలపైనే మన శక్తిని కేంద్రీకరించడం మన మహత్తర బాధ్యతలను గుర్తించక పోవడమే. కాన బాలిరెడ్డిగారు కిసాన్ ఐక్యతను యిలాంటి అప్రాధాన్య సమస్యల నాధారముగ గొని క్రమ శిక్షణ పేరుతో భగ్నపర్చకుండా వుండగలరని ఆశిస్తున్నాను.

మంగళాపురం, చల్లపల్లిలోని యెస్టేటు బంజరు భూములనేగాక, మొత్తం ఎస్టేటు అంతటి బంజరు భూములను ఆ యా ప్రదేశాల వ్యవసాయ కూలీలకు శిస్తులేకుండా సాగుకు యెస్టేటువారు యిచ్చేటట్లు కలెక్టరుగారు తగు చర్య గైకొనాలి.

పై కూలీల కోర్కెలను కృష్ణాజిల్లా కలెక్టరుగారు త్వరగా యీడేర్చి వారికి న్యాయం కల్గించేందుకు చల్లపల్లి యెస్టేటు ప్రజలు ఆంధ్ర దేశములోని కూలీ, రైతు శ్రేయోభిలాషులు తీవ్ర ఆందోళన గావించాలి.

యుద్ధంవల్ల వచ్చిన ఆహార పదార్థాల కొరతను తీర్చడానికి ఇలాంటి కూలీల కోర్కెలను సత్వరమే యీడేర్చడం వలన ప్రభుత్వ యుద్ధ కృషికి ప్రజా సామాన్యం ఉత్సాహకరంగా చేయూత నివ్వడానికి తోడ్పడుతుంది. ఈ బాధ్యత ప్రభుత్వోద్యోగులపైవుంది. కృష్ణాజిల్లా కలెక్టరుగారు తమపై నున్న ఈ విద్యుక్త కర్తవ్యాన్ని వెంటనే నెరవేరుస్తారని ఆశిస్తున్నాము.

★ కథ

చీనా వీరుడు

ఆకాశం ఉన్నతంగా నిర్మలంగా ప్రశాంతంగా వుంది. జులై మాసాంతపు సూర్యకిరణాలతో ప్రసారితమైన మేఘాలు, దిగ్మండలంపై క్రిందుగా, నిల్కు గుడ్డల లాంతర్లలా ప్రకాశించుతూ, వ్రేలాడు తున్నాయి. ఫిరంగుల గర్జనగాని, యుద్ధరంగానికి కదలుచున్న సైనికుల పాద తాడన ధ్వనిగాని వినపడటం లేదు. పురాతన పీకింగు నగరంలో ఇపుడు యుద్ధం జరగడంలేదు. నగరంలో జీవితం మళ్ళాశాంతి యుతంగా నడుస్తోంది. పట్టణాన్ని కొలది రోజులలోనే జపాను సైన్యంవచ్చి ఆక్రమించుతుందని వీధులలో కవాత్ (పెరేడ్) చేస్తుందని ప్రకటించినా, ఎవరిలోనూ ఆందోళన కల్గినట్లు గాని విసుగుపుట్టినట్లు గాని కన్పించలేదు. ఎప్పుడూ ఎలాప్రశాంతంగా గడిపేవారో అలాగే, ఏమీసంభవించనట్లే, యుద్ధాన్నప్పుడే మరచిపోయినట్లే, ప్రజలు భోంచేశారు. పండుకున్నారు తమతమ పనులను నిర్వర్తించుకొంటూ పోయారు ప్రొద్దెక్క సాగింది. గాలి రివ్వున వీయసాగింది..... పట్టణాన్ని ఆక్రమించే దినం వచ్చింది,

ఆవేళ ఎండబాగా కాస్తోంది, ప్రాతఃకాలం నుండి జపాను సైన్యాలు పోతాయని అనుకుంటున్న వీధుల గుండా ఊరికే తిరగడం మొదలెట్టారు ఏదో పండుగ రోజున ఉత్సవపుటూరేగింపుకోసం వేచియున్నారా అన్నట్లు, వారు కబుర్లతో పరిహాసాలతో నవ్వుతూ విశ్రాంతిగా కాలంవెళ్లబుచ్చసాగారువీధులలోకిమాటిమాటికి వస్తున్న ఈ ప్రజలను, పోలీసులు ప్రక్కబాటలలోకి నెట్టసాగారు. మళ్లీ ప్రజలు వీధుల్లోకి పోసాగారు. వీరుపోవడం, పోలీసులు నెట్టడం ఇలా, ఆ ఉదయం అంతా ఈపిచ్చి ఆటతో గడిచి పోయింది.

దాదాపు 11½ ప్రాంతాల, వెచ్చని పొడి గాలిలోనుండి మర్మరధ్వని బయలుదేరింది. అది భూమిలోనుండి బరువుగా ఊపుతూ వస్తూ వున్నట్లు కన్పించింది. ప్రజలలో సంచలనం బయలుదేరింది. ఒక్కసారిగావేలకొలది మనుష్యుల నోటివెంట మాటలు వెలువడ్డాయి.

వీధిచిట్ట చివర ఎక్కడో మోటారు సైకిల్ కన్పించింది.

"అదిగో వస్తున్నారు" అంటూ ఎవడో అన్నాడు. గుంపుఅంతా మాట్లాడకుండాచల్లబడింది.

మోటారు సైకిల్ సమీపించింది. నెమ్మదిగా నడవసాగింది. కాని దాని పైనవుంది జపాను వాళ్లుకాదు, ఇద్దరు పోలీసులు. గుంపుమళ్లా చప్పట్లుకొట్టసాగింది. ఇంకో మోటారు సైకిల్ దానితర్వాత ఇంకొకటి స్తబ్ధంగా దీర్ఘ కాలం నిలబడిన పిడుగు శబ్దం దగ్గరకు దొర్లుతూ వచ్చినట్లుగా - మోటారు సైకిళ్ళ గర్ గర్ ధ్వని అంతకంతకూ హెచ్చసాగింది.

చిట్టచివరకు దిఙ్మండలంలో నుండి నమ్మడానికి వీలులేనంత - పెద్ద జపాను పతాకం పైకిలేచింది. అదిచూడటంతో ప్రజఅంతా నిర్ఘాంతపోయినవారిలాగా నిశ్శబ్దంగా రాతి విగ్రహాలులాగా నిలబడిపోయారు, ఉద్రేకం గాని విచారంగాని లేకుండా విచిత్రమయిన మట్టి బొమ్మల తొడుగులులాగా వారి ముఖాలు అయిపోయాయి, నేలఅంతా చిందర వందరగా ఇనుప చక్రాలతో కుర్రింగదీస్తున్న టాంకు పైన జపాను పతాకం ఎగురుతుంది. కచ్చువుగా వున్నా విజయ గీతం పాడుతున్నదా అన్నట్లు టాంకు రణగొణధ్వని భీతిని కల్గించుతుంది. భూమినంతా ముక్కలు ముక్కలు చేస్తానని బెదరించుతున్నట్లు వుంది. జండా నాటు కర్రను తన చేతులలోకి పట్టుకొని ముందుకు చూస్తూ, ఒక జపాను సార్జెంటు దానిపై ఎక్కికూర్చున్నాడు. ఆటాంకు వెంటనే, జపాను సైనికులు ఒక చతురంలాగా, జర్మను గూస్ - స్టెప్స్‌తో నడువ సాగాడు.

పొట్టిగా, విశాలమైన భుజాలు, నిశితమైనప్పటికీ ఏదో నవ్వుబుట్టించే దృక్కులతో, వాళ్ళంతా ఒకేలాగ వున్నారు. వాళ్ళ సార్జంటులాగానే వాళ్ళుకూడా, తమముందు నున్నదేది చూడలేని గుడ్డివాళ్ళలాగ, తమముక్కుకు సూటిగా చూడటం మొదలెట్టారు. అప్రతిహతమైన, ఇనుముతో నిర్మించారా అన్నట్లు వున్నారు వాళ్ళు.

ఈ సైనికుల వెనుక మళ్లా ఒక వెధవ టాంకు వచ్చింది. దానివెనుక సైనికులు, వారి వెనుక మరోటాంకూ, ఇదీ వరుస. టాంకులు, పతాకాలు, సైనికులు....ఇలా వీధిఅంతా నిండిపోయింది. పట్టణవాసులందరూ జపాను సైనికులను చూడటం తోనే నిర్ఘాంతపోయి చీకట్లోకి ఒదిగి పోయి పట్టణాన్ని ఖాళీచేశారా అన్నట్లు, పట్టణమంతా అతి నిశ్శబ్దంగా వుంది.

అకస్మాత్తుగా విసుగుపుట్టించే ఈనిశ్శబ్దతను చీల్చు కుంటూ - ఒకబాలకుని స్పష్టమైన ఉచ్చస్వరం వినపడింది.

"జపాన్ సామ్రాజ్య వాదం నశించుగాక!" ప్రజలు పోలీసులు, జపాను వాళ్ళ సైతం, ప్రతివారూ ఆశ్చర్యచకితు లయ్యారు.

చచ్చినట్లుప్రశాంతంగాఉన్నవీధంతాతక్షణమే జీవం పోసుకొంది. భయపెడుతున్న టాంకులు కల్గించే విషమావస్థ (టెన్షన్) నుండి తప్పించుకొన్నవాడిలాగా ఒకడు నిట్టూర్పు విడిచాడు. మరొకడు ఏదోమాట్లాడాడు. ప్రజలలోబడి పోలీసులు పరుగెత్తసాగారు, జపానుసైనికులు తలత్రిప్పి ప్రక్కవైపులకు చూడసాగారు. ఈ అల్లకల్లోల శబ్దాన్ని చీల్చుకుంటూ మరో నిశితమైన అద్భుతమైన కేకవినబడింది. "జపాను సామ్రాజ్య వాదం నశించుగాక!"

ఆ గుంపును చీల్చుకుంటూ ఒక తొమ్మిదేండ్ల కుర్రాడు వీధిలోకివచ్చాడు. జపానుసైనికులముందు అతడుదృఢంగా నిశ్చలంగా నిలబడ్డాడు. ఎడమ చెయ్యిపైకెత్తి ప్రజలను తన వెంబడి రమ్మని సైగ చేస్తున్నాడు. చెక్కిళ్ళు ఎర్రబారినాయి క్రోధంతో ఆవేశంతో కంఠం నుండిమాటపెకలి రావడంలేదు. బలమంతా ఉపయోగించి ఇలా అరిచాడు.

"చైనా రిపబ్లిక్ చిరస్థాయి అగు గాక!" మిలిటరీ కవాతు ఆగిపోయింది. ప్రజలు ప్రశాంతంగా ఉండిపోయారు. ఒక జపాను ఆఫీసరూ, మరో నల్గురు సైనికులు పిల్లవాడి దగ్గరకు వచ్చారు ప్రజలగుంపు నిశ్శబ్దంగా వారివంక చూడటం మొదలెట్టింది. ఎవడూ మాటాడ లేదు. గుసగుసలాడ లేదు. దగ్గలేదు కాని కుర్రవాడు వణకలేదు. అతడు భయపడలేదు. అతడు క్రోధోన్మత్తుడై జాతీయ గీతాన్ని పాడసాగాడు.

బానిసత్వమును వాంఛింపని
ప్రజలందరు రండీ॥
మనరక్తమాంసములు మహాకుడ్యముగ
నిర్మింతాం రారండీ॥
మాతృభూమిపై ఆపద ఇప్పుడు
అలముకొంచినాదీ॥

అతడు పెద్ద బ్రహ్మాండమైన వ్యక్తిలా కన్పించాడు. అతని కంఠధ్వని వీధియావత్తు వినపడేటంత పెద్దదిగా కన్పించింది. అతడు పాడేటప్పుడు జపాను ఆఫీసరు కత్తితో అతని గుండెల్లో పొడిచాడు. కుర్రాడు మూరిగాడు. నెమ్మదిగా - కొద్దిగా అతని మూల్గు ఉంది అయినా అతని పాట నినాదం లాగానే యావత్తు వీధికి అదివినపడింది. ప్రజల గుంపు చిత్రంగా మూకీభావం వహించింది. వారిలో కోపంగాని విచారంగాని ఆవేశంగాని కన్పించ లేదు. పిల్ల వాడివంక జపాను ఆఫీసరు వంక సైనికులవంక, మూగవాళ్ళలాగా కదలకుండా చూడసాగారు.

జపాను ఆఫీసరు చచ్చిపోయిన కుర్రాణ్ణి వీధి నడమధ్యపారేశాడు. మిలిటరీ పెరేడ్ మళ్ళీసాగింది. కుర్రాణ్ణి నులిమివేస్తూటాంకులు అతనిపైగా నడిచాయి. చిందరవందరమైన అతనిదేహాన్ని తొక్కుకుంటూ సైనికులు నడిచిపోసాగారు. సైనికులు తమ ముందునఉన్నదేదీ చూడలేనిగుడ్డివాళ్ళలాగా, ముక్కుకు సూటిగా నడవ సాగారు; సైనికులు ప్రజలూ ఇద్దరుకూడా, నిశ్శబ్దంగావున్నారు.

ఒకగంట తర్వాత జపాను ఊరేగింపు అయిపోయింది. కాని, మరోఊరేగింపు దాని స్థానే వచ్చింది. ఇది చాలా పెద్దఉత్సవం కారణం. ఇది మతసంబంధమైనది. మనచైనా వీరకిశోరుని భూమిమెలనూ, చిందరవందరగా విరజిమ్మబడిన మాంసపు కండలనూ, ప్రజలు జాగ్రత్తగా ఎత్తారు. వాటిని సమాధి చేశారు. ఆవీధివెనుక ఒకదేవాలయం నిర్మించారు.

ఒక కొత్త దేవుడు పుట్టాడు.

"న్యూమాసెస్" నుండి.

బెంగాల్ విద్యార్థుల ఆదర్శకృషి - మరో ఘటన

మరియొక ఉదంతం 'గ' అనేపట్టణం చుట్టూవున్న గ్రామాలను 24గంటల్లో ఖాళీచెయ్యాలని ఉత్తరువులు వచ్చాయి.

జిల్లావిద్యార్థి ఫెడరేషను వెంటనే ఒకరిని రాష్ట్రవిద్యార్థి ఫెడరేషను ఆఫీసుకు పంపింది. ఆ కామ్రేడ్, వేలకొలది గ్రామస్తులు ఎవరిసామాన్లువారు పట్టుకుని ఎంత చిందరవందరగా త్రొక్కిసలాడుతున్నారో వర్ణించి చెప్పాడు. 24 గంటలు వ్యవధి పూర్తి కాకుండానే మిలిటరీ వచ్చి గ్రామంలో ప్రవేశించింది. రైతులను ఇండ్లలోనుంచి బైటికి లాగివేశారు.

తాతలనాటినుంచి వున్న వారికొంపలు పడగొట్టారు. ధాన్యపు గాదుల్ని దోచుకుపోయారు. సైనికుల ప్రవర్తన రైతులలో తీవ్ర అసంతృప్తి కలిగించింది. దొమ్మీలు జరుగుతాయని కూడా మేము భయపడ్డాం. వెంటనే ఏదోఒకటి చేయకపోతే లాభంలేదు.

బెంగాలురాష్ట్రవిద్యార్థి ఫెడరేషను కార్యదర్శి తక్షణమే కొందరు వాలంటీర్లను తీసుకొని ఆ స్థలానికి బయలుదేరాడు. అక్కడికి వెళ్ళే ముందు కలకాత్తాలో హోమ్‌మంత్రితో ఈపరిస్థితులను గురించి మాట్లాడుదామని వెళ్లాడు. మంత్రిగారుచాల తొందరపనులలో నిమగ్నులైవున్నారట, మాట్లాడటానికి వీలులేదని వారి కార్యదర్శి సెలవిచ్చాడు. అప్పుడు మేము స్థానిక పత్రికలవారిని కలుసుకున్నాము. వారు డిఫెన్సు ఆర్డినెన్సు పేరు జెప్పి మావల్లకాదని ఒక్క నమస్కారం పెట్టారు.

వెంటనే మా కార్యదర్శి స్థానికకాంగ్రెసు నాయకులను తదితరప్రజాసంస్థలవారిని కలుసుకున్నాడు. ముస్లింలీగు, కిసాన్‌సభ, రెండూ మాతో సహకారంతో పనిచేయడానికి అంగీకరించాయి. వాలంటీర్లను పంపాయి. కాంగ్రెసు వారుకూడా సహాయంచేస్తామని వాగ్దానంచేశారు కాని ఎక్కువమంది వాలంటీర్లను పంపలేకపోయారు. ప్రజలు ఆదరణతో విరివిగా ధన సహాయంచేశారు.

మా కార్యదర్శి జిల్లాకలెక్టరునుకూడా కలుసుకున్నాడు. కలెక్టరుగారు చాలా భీతావహులైవున్నారు, పాపం! ఆయన ఒకరైతులమీటింగుకి వెళ్ళినపుడు రైతులు అయనను తరిమితరిమికొట్టారు. అప్పటినుంచి అయన రైతులవద్దకు వెళ్ల నిరాకరించి కూర్చున్నాడు.

కలెక్టరు, మా కోరికలన్నిటికి అంగీకరించాడు. ప్రయాణాలకు అయ్యే ఖర్చులిస్తానన్నాడు రైతులకు విత్తులు ఇతరపరికరాలు సప్లయి చేస్తానన్నాడు.

మిలటరీ ఆక్రమించినస్థలానికి, జమీందారుకు రైతులివ్వవలసిన మగతా ప్రభుత్వం ఇచ్చుకోడానికి అంగీకరించాడు. కొద్దిరోజులైనతరువాత ప్రభుత్వం ఒకప్రత్యేక కమ్యూనిక్‌లో ఇవన్నీ అంగీకరించానని ప్రకటించింది.

కాని మేమంతటితో సంతృప్తి చెందలేదు. కలెక్టరుగారే స్వయంగా ఆ ప్రాంతాలకు రావాలని కోరాం. రాకపోతే పెద్ద ఆకలియాత్ర లేవదీయవలసి వస్తుందని చెప్పాము. ఆయన విధిలేక అంగీకరించాడు.

మేము కొందరం జిల్లాకలెక్టరు గారితో మాట్లాడి ఏర్పాట్లుచేస్తూవుండగానే కిసాన్‌సభ, ముస్లింలీగులసహకారంతో మావాళ్ల గ్రామాలకుపోయి పరిస్థితులు చక్కబరచారు. మేము గ్రామాలకు వెళ్లేసరికి ఒక్క ప్రభుత్వోద్యోగి కూడా మాకక్కడ కనబడలేదు. వాళ్లలోనుంచి బలవంతంగా వెళ్లగొట్టబడిన రైతులంతా ఒకచోట గుమిగూడారు, కొందరుప్రభుత్వ ఏసనాన్ని దిక్కరించాలని కూడాపట్టుబట్టారు.

వీరిని రెచ్చగొట్టటానికి పార్వర్డ్‌బ్లాకు ఏజెంట్లు కొందరు తయారయ్యారు, కానివారిఆటలు మాదగ్గరసాగలేదు. ఆ ముఠావారి నందరిని ఏరిపారవేశాము. 'క' అనేప్రదేశంలో చేసినట్లే రైతులకు పరిస్థితులన్నీ తెలియబరిచాము. ప్రజలలో ఉధృతం తగ్గింది.

జిల్లాకలెక్టరువచ్చాడు తనస్థితినివిశదీకరించుకుంటూ, అవ్యవధిగా ఇచ్చిన ఈ తొందర ఆర్డర్లకు సరియైన ఏర్పాటు చేయలేనందుకు క్షమాపణచెప్పమని కోరాము. ఆయన అలాగే చేశాడు. రైతులకు ఉచితంగా ఇచ్చే స్థలాలు ఏతేదీనుంచి ఇస్తారో ఆరోజుకూడ అక్కడే నిర్ణయించిచెప్పించాము. రైతుల ప్రయాణాలకు కావలసినడబ్బు అక్కడే మాచేతికిచ్చాడు. కావలసినఏర్పాట్లన్నీ చేస్తామని చెప్పాడు. ఆయన వెళ్లబోయేముందు పునర్నిర్మాణానికి విరాళం అడిగాము. వాగ్దానం చేసినమొత్తంలో సగం అప్పటి కప్పుడే ఇచ్చివేశాడు.

ఈ లోపుగానే మనకామ్రేడ్సుబళ్లు, పడవలు వగైరా ప్రయాణపుటేర్పాట్లన్నీ సిద్ధంచేయడం మొదలుపెట్టారు. ఒక 70 మంది వంటచేసే వాళ్లతో వంటలు ఏర్పాటుచేశాము. 6000 మందికి భోజనాలు పెట్టాము.

ఈ ఏర్పాటులన్నిటిలోను ముస్లింలీగుమాకు చాలాసహాయంచేసింది. నిజంగా వారిసహాయం లేకపోతే ఈవంటలు పడవలఏర్పాట్లుకష్టమైపోయేవి. చివరకి ఆప్రాంతంలోనిజనాభాఅంతా ప్రశాంతంగా ఖాళీచేసివెళ్లిపోయారు.

మేము ఈమాకుఇంతటితోనే ఆగదలచుకోలేదు. దేశభక్తిప్రచారంకూడా చేయదలచాము. ఈ కాందిశీకులకు కావలసిన సహాయమంతా చేస్తూ వారిలో జపానువ్యతిరేక ప్రచారంచేయడానికి ఇద్దరిని ప్రత్యేకంగా నియమించాము. ముస్లింలీగుకూడా మరిఇద్దరిని ఇతయిచ్చింది.

ప్రజాసమీకరణకు బందీలను విడువాలి!

జులై 12 న ఆందోళన చేయండి

"ప్రాచ్య పశ్చిమభాగాలనుండి ఫేసిస్టు దండయాత్రికులు చొచ్చుకు వస్తున్నారు. మన అస్తిత్వం, మన భవిష్యత్తు ప్రమాదావస్థలో వుంది. మన ప్రాచీనజాతి సంతానంలోని ప్రతి స్త్రీ ప్రతి పురుషుడూ, జాతీయప్రతిఘటనా, సగర్వ బలిదానమా? లేక పిరికి పిరికి పదఘాలమూ నీచమైన లొంగుబాటా? అను ఈ రెండిటిలో దేనినో ఒకదానిని ఎన్నుకోవాలి. ఫేసిస్టు దండయాత్రికుని జయప్రదంగా ప్రతిఘటించుటలోనే హిందూదేశ స్వాతంత్ర్యం వుంది. ఇండియారక్షణ, ప్రతి దేశభక్తునీ అతని కర్తవ్యాన్ని అతడు నెరవేర్చాలని కోరుతుంది.

ఫేసిస్టు అనుకూలురు పిరికితనంతో అపజయాన్ని కాంక్షించే వారూ (డిఫీటిస్టులూ) అనేకమంది బయటవుంటే, వందలకొలది ఫేసిస్టు ప్రతికూల గాఢ దేశభక్తులు జైళ్ళలో వుండటం మహావిషాదకరమైన విషయం. వారిలో చాలమంది కమ్యూనిస్టులు. వీరు ఫేసిస్టు ప్రతికూలురు అని ఋజువు చేయబడినవారు, గాఢమైన దేశభక్తులు. స్వాతంత్ర్యంకోసం ఆమరణాంతం పోరాడడానికి, తమ యువజీవితాలను ధారపోసిన దేశభక్తులు. స్వతంత్రదేశాల సౌభ్రాతృత్వంకోసం కృషిచేసిన వీరులు.

వీరిలో వందలకొలదిగా, అనుభవమూ, పలుకుబడీకల్గిన కార్మిక కర్షక సేవకులున్నారు. బొంబాయి కార్మికనాయకులగు డాంగే, రణదివే, షహీద్, బుఖారి, ఘోగ్లే, పాట్కర్ ఇంకా వారి ముఖ్యమైన సోదరులు; నాసిక్—యర్రవాడా, తానా జైళ్ళలో డిటిన్యూలుగానున్నారు. కాన్పూరు కార్మికనాయకులగు భరద్వాజ, యూసఫ్‌లు బెరిల్లీ జైలులో డెటిన్యూలుగా నున్నారు. బీహారు రైతువర్కర్లనేకమందిలోపాటు రాహుల్ సంకృతాయన్ హజరీబాగ్ జైలులో మ్రగ్గుచున్నాడు. దక్షిణదేశపు కార్మిక కర్షక వర్కర్లు వెల్లూరు, బళ్లారి కన్ననూరు జైళ్ళలో బందీలుగా వున్నారు.

వీరిలో వందలకొలది "ఇంటర్నీలు" ఒకానొక ప్రదేశంనుండి కదలరాదని నిషేధింపబడినవారు) "ఎక్స్టర్నీ"లు (ఇతరప్రాంతాలకు వెళ్ళగొట్టబడినవారు) ముఖ్యంగా బెంగాలులో వున్నారు. మొట్టమొదట బెంగాల్ పైననే జపాను దుముక సిద్ధంగా వున్నరోజులలో, కొంతమంది తమ తమ స్థానాలలో వుండి ప్రతిఘటించే అవకాశం పోతున్నది. మాట్లాడరాదని కదలరాదనే నిషేధాలతో మరి కొంతమంది ఇండ్లలోను కుగ్రామాలలోను ఇంటరన్ చేయబడ్డారు.

వీరిలో యావజ్జీవ శిక్ష విధించబడిన కె. పి. ఆర్. గోపాలన్ మరి అట్టివారూ వున్నారు. ఇంకా మరణశిక్ష విధించబడి అప్పీలు ఫలితాలకు ఎదురుచూస్తున్నట్టియూ—వివిధ శిక్షలకు గురియై శిక్ష ననుభవించుచున్నట్టియూ కయ్యూరు శిక్షితులున్నారు.

వీరిలో లాహోరు కుట్రకేసు ఖైదీలు—భగత్‌సింగ్ సహచరులు — లక్నో బెరిల్లీ జైళ్ళలో పడివున్నారు. వారెన్నడో చాల దీర్ఘంగా చర్చలు జరిపినపిమ్మట, చాలా చదివిన పిమ్మట, టెర్రరిస్టు పంథా వదలి కమ్యూనిస్టు పంథాకు వచ్చారు. వీరింకా జైళ్ళలో పడివున్నారు.

వీరిలో చిటగాంగ్ వీరయోధులున్నారు. ఈ యుద్ధం తమ యుద్ధంగా భావించండని వీరు ప్రజలకు విజ్ఞప్తి గావించారు. ప్రభుత్వం ఈ విజ్ఞప్తిని ఉపయోగించుకున్నది. కాని వీరిని వదలడానికి సంశయించుతుంది. విదేశ నిరంకుశ ప్రభుత్వం ఎన్ని తప్పులు చేసినా లెక్కచేయకుండా తమ చేతనైనంత చేయవలసిందని, ప్రజలనువారు జైళ్ళలోనుండి కోరారు. అలా జైళ్ళలోపలనుండి చెప్పినదానినే, విడుదల చేస్తే బయట సంఘటన పరచవచ్చు. అలా సంఘటన పరచడానికి గాను వీరిని వదలడానికి ప్రభుత్వం ఇంకా సంశయిస్తూనే వుంది.

వీరిలో నిష్కపటులైన దేశభక్తులున్నారు, మర్యాదస్తులయిన కాంగ్రెసువాదు లున్నారు. వీరు దైనందిన కార్యక్రమం సాగించుకొనేవారు. ప్రజలకు దేశభక్తిని పురిగొల్పడాన్ని చూచి సహించలేని స్థానిక ఉద్యోగులు సహించలేకపోయారు. ఇలాంటిఅరెస్టులు యు.పి.లో హెచ్చిపోతున్నాయి.

ప్రజలమధ్యకు వీరందరూ రావడం, భారతదేశానికి నేడు అత్యంత అవసరం.

ఫాసిస్టు దండయాత్రికులకు వ్యతిరేకంగా ప్రజల నుత్తేజపరచడానికి వారు మాకవసరం.

మాజాతిని సంయుక్తపరచుటలో సహాయం గావించడానికి, ఫాసిష్టు ఉపద్రవాన్ని ఎదుర్కోడానికి, జాతీయ ప్రభుత్వాన్ని సాధించడానికి వారు మాకవసరం.

ఆత్మరక్షణకై ప్రజలను సమీకరించడానికి వారు మాకు అవసరం.

త్వరత్వరగా మార్పుచెందే పరిస్థితులలో ప్రజల హక్కులను కాపాడటానికి వారు మాకు అవసరం.

కార్మికులు తమతమ పనులలో నుండి ఉత్పత్తి చక్రం నిరంతరం తిరుగుతూ వుండడానికి వారు మాకవసరం. ట్రేడ్ యూనియన్లను బలపరచడానికి, కార్మికులు ధరలు పెరగడం మూలాన అవసరమైన అధిక జీతాలను పొందడానికి, అధిక లాభాలను అరికట్టడానికి, సామర్థ్యాలతో గూడిన యుద్ధ ఉత్పత్తికై ప్రజాఉద్యమాన్ని నడపడానికిగాను, వారు మా కవసరం.

ఆహారపదార్థాలను ఎక్కువ పండించండి అనే వుద్యమాన్ని పల్లెలలో నడపడానికి, ప్రమాదం సామీప్యంలో వున్న రాష్ట్రాలలో రైతులకు సైన్యానికి మధ్య సోదర సహకారం నెలకొల్పడానికి గాను వారు మా కవసరం.

జాతీయ ప్రతిఘటనలో సర్వకాలము స్వార్థత్యాగ సేవచేయాలని యువక దేశభక్తుల నుత్సాహపరచడానికి వారు మా కవసరం.

ఫాసిస్టు వ్యతిరేక దేశభక్తులను జైళ్ళలో బంధించడం, ఫేసిస్టులకు తప్ప మరెవ్వరికీ సహాయం చెయ్యదు. వారిని విడిచిపెట్టకుండటం అంటే ప్రభుత్వం ఇండియా భవిష్యత్తుతో జూదమాడుచున్నదన్నమాట. ప్రజాసమీకరణ అంటే దానికిగల భయమే అడ్డువస్తున్నది. అది దేశభక్తులను నమ్మడంలేదు.

దేశభక్తులను వదలిపెట్టాలని దేశమంతటా ఆందోళన చేయడం, బ్రిటనులోను తదితర దేశాలలోను అభివృద్ధి కరశక్తులు, దానికి ప్రోద్బలం చేయడమూ, ప్రభుత్వం తన పాత విధానాన్ని మార్చుకొనేటట్లు చేసింది. విడుదలలు జరుగుచున్నాయి. కాని సంపూర్ణంగా కాదు. అతిముఖ్యమైన కామ్రేడ్సు ఇంకా ఖైదీలుగానే వున్నారు. జపాను వాళ్లు జర్మన్లు అతి తొందరగా పరుగెత్తుకు వస్తున్నామన ప్రభుత్వ యంత్రం మాత్రం కదలడం లేదు. నేటివిషమ పరిస్థితి "తక్షణం అందరినీ విడుదల చేయండి" అని ఘోషించుతోంది.

ప్రభుత్వోద్యోగులు వాళ్ళంతకు వాళ్ళు కదలరు. రెడ్-టేప (రికార్డు తిరగవేస్తూ కూచోడం) అడ్డువస్తుంది. దేశభక్తుల సేవను కోరే ప్రజలు మరోసారి ఐక్యం గలుగజేసుకోవాలని కోరుచున్నాం. మొదటనుండి విడుదలకోసం ఎంతో ఓర్పుగా పనిచేయుచున్న కామ్రేడ్ యన్. యం. జోషీ జులై 12 వ దేశమంతటా ఖైదీల విడుదల దినోత్సవం జరపమనికోరారు. మేమావిజ్ఞప్తిలో హృదయపూర్వకంగాచేరి జులై 12 వ తేదిన విడుదల కోసం తీవ్రమైన ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించమని మన కామ్రేడ్సు నందరినీ కోరుచున్నాం. కాలచక్రం గిర్రున తిరుగుతున్నది. విదేశ దండయాత్రీకులకు వ్యతిరేకంగా జరిగే భారత దేశయాత్రలో, మన కామ్రేడ్సును విడుదల చేయించుకొనడం, ప్రథమ ప్రజావిజయం అవుతుంది."

ఇందూలాల్ యాజ్ఞిక్,
(అ. భా. కిసాన్‌సభ అధ్యక్షులు.)
పి. సి. జోషీ,
(హిందూదేశ కమ్యూనిస్టుల తరపున)
పెరిన్ బరూచా,
(అ. భా. విద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శిని)

ఒక వైపు విడుదల- మరొక వైపు శిక్షలు?

బళ్ళారి జైలులో వివిధ శిక్షలు అనుభవించుతున్న కామ్రేడ్స్ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, జాలాది పార్థసారధి, గుత్తా ఆంజనేయులు, సదాశివన్ (పూర్తిగా శిక్ష ననుభవించారు) నెక్కంటి నరసింహారావు, హరి దక్షిణామూర్తి, సి. హెచ్. వెంకటాద్రిజు, మరి కొందరు తమిళ కామ్రేడ్స్ విడుదల అయ్యారు. కంభంపాటి సత్యనారాయణ (జూనియర్) రామయ్య (కోయంబత్తూరు) గార్లను విడుదల చేసి మళ్ళా వెల్లూరులో డిటైన్ చేశారు. విస్తరాకులు వేసేవాళ్ల వేస్తుంటే తీసేవాళ్ళు తీసిన కథ జ్ఞాపకం తెస్తోంది ప్రభుత్వం.

కామ్రేడ్ జొన్నలగడ్డ రామలింగయ్యకు రెండు కేసులలో 4 నెలలు 8 నెలలు కఠిన శిక్ష విధించారు. సి. క్లాసు నిచ్చారు.

సి. వి. కృష్ణరావుగారికి అపీల్‌లో శిక్ష తగ్గించబడినా, ఆయనను 24 గంటలూ లాకప్‌లో వుంచడం అమానుషం. వావిలాల గోపాలకృష్ణయ్యగారిని గుంటూరు నుండి మార్చి సత్తెనపల్లిలో ఇంటరన్ చేశారు. నండూరి ప్రసాదరావుగారిపై ఇంటరన్‌మెంట్ ఆర్డరు రద్దుకాలేదు. విశాఖపట్టణం రైతులపై కేసులింకా జరుగుతూనే వున్నాయి. విడుదలకాని డిటిన్యూలను రాజకీయ ఖైదీలను విడుదల చేయమని ఆందోళన చేయుటతో పాటు, క్రొంగొత్తగా శిక్షింపబడినవారి విడుదలకు కూడ ఆందోళన చేయండి!

చలసాని వాసుదేవరావు.

కార్మిక నాయకుడు ఎన్. యం. జోషీ ప్రకటన

"1941 నవంబరులో, వివిధరాష్ట్రాలలోని డిటిన్యూల విడుదల విషయంలో వారివారి కేసులను పునరాలోచించుతామని ప్రభుత్వం వాగ్దానంచేసింది. ఆతరువాత కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వములు ఈపనికోసం టీలను నియమించాయి. డిటిన్యూలు తమ సంగతిని గురించి విశదీకరించమని కోరబడ్డారు. ఈ లోపున కొన్ని రాష్ట్రాలలో కొద్దిమంది డిటిన్యూలు మాత్రం విడిచిపెట్టబడ్డారు. డిటిన్యూలు ఆ కమిటీలకు పంపిన సంజాయిషీలు ఏమిటో ప్రకటింపబడ లేదు. ఎక్కువ మంది డిటిన్యూలు విడిచిపెట్టబడనేలేదు.

ఇక్కడ ఒకవిషయం గమనించాలి. ఈ విడిచిపెట్టబడని వారంతా కమ్యూనిస్టులనే కారణంతో డిటైను చేయబడ్డారు. వీరు గతసంవత్సరంనుంచి, ఈ యుద్ధం యెడల తమపాలసీని, అతిస్పష్టమైన మాటలలో తెలియజేస్తూ వున్నప్పటికీ, బైటనున్న కమ్యూనిస్టులు ఈ యుద్ధ ప్రయత్నాలకు అనేకవిధాల క్రియారూపంలో సాయం చేస్తున్నప్పటికీ కమ్యూనిస్టు డిటిన్యూలను అందరినీ ప్రభుత్వం విడిచిపెట్టలేదు. దురదృష్టవశాత్తు ప్రభుత్వం కమ్యూనిస్టుల యెడల ఇదివరకుగల రాజకీయ ద్వేషాన్ని ఇంకా మనస్సులో పెట్టుకునివుంది. దాని ఫలితంగా చాల మంది కమ్యూనిస్టులు ఇంకా జైళ్ళలో మ్రగ్గుతున్నారు.

అందుచే దేశంలోని కార్మిక రైతు, విద్యార్థి సంఘాల వారు పౌరసత్వ హక్కుల కోసం పోరాడే అన్ని సంఘాలూ, యావత్ ప్రజలూ కలసి, డిటిన్యూల నందరిని ఎట్టి షరతులు లేకుండా విడుదల చేయాలని, విడుదలైన వారిపై పెట్టిన నిర్బంధాలు తొలగించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూ ఆందోళన చెయ్యాలి. వివిధరాష్ట్రీయ ప్రభుత్వాలు తమ యీ కర్తవ్యాన్ని గుర్తించేలాగ చెయ్యాలి. అందుకుగాను జూలై 12 వ తేదీన రాజకీయ ఖైదీల విడుదల దినోత్సవం జరపాలని కోరుతున్నాను. బ్రహ్మాండమైన వూరేగింపులు మీటింగులు జరపాలి. మనదేశానికి సంభవించిన ఈ క్లిష్టసమయంలో ఫాసిస్టు వ్యతిరేకులైన రాజకీయ ఖైదీలందరిని విడిచిపెట్టడం ఎంతో అవసరం. దేశరక్షణ కోసం వారికి జైలుఖానానుండి విముక్తి కావాలి!

బర్మాయుద్ధము : మనం నేర్చుకోవలసిన గుణపాఠాలు

బర్మాయుద్ధం ముగిసి చాల రోజులు గడిచాయి. అయినప్పటికీ ఆయుద్ధంలో మిత్రమండలి సైన్యాల పరాజయానికి కారణాలను పరిశీలించి, ఆ అనుభవాన్ని జపాను ఫేసిస్టు దాడినుండి భారతదేశాన్ని రక్షించడానికి ఉపయోగించడం, భారతీయులకు ఎంతో అవసరం.

భారతసేనల సర్వసైన్యాధ్యక్షుడయిన జనరలు వేవెలు, బర్మాలో మిత్రమండలి సేనల సర్వసైన్యాధ్యక్షుడయిన జనరలు అలెగ్జాండరు, ఇంకా ఇతర ముఖ్య సైన్యాధికార్లు మిత్రమండలి సేనల ఓటమికి చెప్పిన కారణాల్లో ఈ క్రింద పేర్కొనబడిన ప్రధానమైనది.

(1) "బర్మా ప్రజల్లో 100 కి 10 మంది తప్పకుండా బ్రిటిషుఅనుకూలురు. బహుశా జపాను అనుకూలురుగా ఉన్నవారు కూడ 100 కి 10 మంది ఉంటారు. మిగతా 100 కి 80 మంది ప్రజలు యుద్ధ విముఖతగలవారై, తమదారి తాము జూచుకొనేవారు. బ్రిటిషు అనుకూలురైన బర్మావారు దేశంలో చెదిరిఉండటం అలాఉంచి, బర్మావారి దుస్తులను ధరిస్తే జపాను వారిని తెలుసుకోవడం సాధారణ వ్యక్తికి చాలకష్టం."

"జపాను పక్షంగా ఉన్నవారిలో మంచి ప్రచారం జరిగింది. జపాను తరపున వారు ఏజెంటుగా పనిచేశారు. బ్రిటను అనుకూలురు, వారివలె చురుకుతనంతో ప్రచారం చేయలేదు."

"రాత్రులందు బర్మావారు జపాను వారికి మార్గం చూపుతూ ఉండేవారు." (జనరలు అలెగ్జాండరు)

బర్మాలో చైనా వైద్యదళ నాయకుడుగా పనిజేసిన డాక్టరు లిమ్, చైనా బర్మాలలో జరిగే యుద్ధాలకు తేడా ఉందనీ, చైనాలోవలె బర్మాలో ప్రజలు సైన్యాలతో సహకారం చేయడంలేదనీ, చైనాలోవలె భూదగ్ధ విధానాన్ని అమలు జరపడంలేదనీ, అందువల్ల జపానువారు త్వరత్వరగా ముందుకు రాగలిగారనీ చెప్పాడు.

(2) "జపానువారి ఆయుధాలు సులువుగా కదల్పడానికి వీలయినవి. మనవి యూరపు యుద్ధంలో పనికి వచ్చేవిగాని, బర్మా మలయాలలో పనికిరావు." (జనరలు అలెగ్జాండరు)

అంటే జపానుటాంకులు, ఫిరంగులు చిన్నవి. బర్మా మలయాలను బోలిన అరణ్యాలు కొండలమయమైన రోడ్లు లేనిప్రదేశాల్లో అవి సునాయాసంగా కదపవచ్చును. బ్రిటిషువారి టాంకులు, ఫిరంగులు చాల పెద్దవి. అవి యూరపు మొదలైన మైదానాలు రోడ్లుగల ప్రదేశాల్లో పనికివస్తాయి గాని బర్మా మలయాలను బోలిన దేశాల్లోగాదు.

(3) "మన సైనికులకన్న జపాను సైనికుల విశేషమేమీ లేదుగాని, బర్మా మలయా రీతిగా జరిగిన యుద్ధాల్లో పాల్గొనడానికి జపాను సైనికులు బాగుగా తర్ఫీదు పొందారు.... బర్మా మలయాల్లో కూడ దట్టమైన మహారణ్యా లున్నవి. ఇట్టి అరణ్య ప్రదేశాల్లో పోరాడటానికి మనసైనికులు ఎంతమాత్రమూ అలవాటు పడియుండలేదు." (జనరలు వేవెలు)

అంటే అరణ్యాలు కొండలు గల ప్రదేశాల్లో పెద్దపెద్ద సైనికదళాలు మైదానాల్లోవలె కట్టగట్టుగానిపోవడం చాలకష్టం. అట్టి ప్రదేశాల్లో షుమారు 10 మందిగల చిన్ని చిన్ని జట్టులుగా పోవడం చాల సులభం. ఇందుకు సైనికులు ముఖ్యంగా ఈ జట్టుల నాయకులు స్థానికంగా వచ్చే సమస్యల నర్థంజేసుకొని పరిష్కరించుకుంటూ ముందుకు బోయే చొరవగలిగియుండాలి. బ్రిటిషు సైన్యాల్లో చిన్న జట్టుల నాయకులకు సైనికులకు చొరవ చాలతక్కువ. ప్రతిసారి పై అధికారుల ఆజ్ఞలకోసం ఎదురుచూస్తూ ఉంటారు. జపాను సైన్యాల్లో ఇట్లుగాక, చిన్నజట్టుల నాయకులకు చొరవ ఉంటుంది. చిన్ని చిన్నిజట్లుగా చొచ్చుకుపోయి శత్రుసైనిక దళాలను హఠాత్తుగా చుట్టు ముట్టి నాశనంజేసే యుద్ధ తంత్రం జపాను సైన్యాలకు నేర్పబడింది.

(4) మిత్రమండలి సైన్యాలకు తగినంత విమాన సహాయంలేదని, బర్మాలో చైనా సైనిక దళాల నాయకుడైన జనరలు స్టిల్‌వెల్ చెప్పాడు ఆధునిక యుద్ధాలలో విమానాలు శత్రు సైనిక వ్యూహాల మీద బాంబులువేసి చెల్లాచెదరు చేస్తాయి. శత్రు ఆయుధ ఫ్యాక్టరీలమీద రహదార్లమీద బాంబులేసి, ధ్వంసం జేసి, శత్రుసైన్యాలకు సరఫరాలు అందకుండజేస్తాయి. అటుతరువాత కాల్బల దళాలు ముందుకు సాగి, చెల్లాచెదరుగా వున్న శత్రుసైన్యాలమీద దాడి జరిపి, వానిని నాశనం జేస్తాయి. కనుక యుద్ధంలో జయించడానికి విమాన బలాధిక్యత అవసరం!

(5) ప్రిన్సు ఆఫ్ వేల్సు, రిప్పల్సు అనే యుద్ధ నౌకల ముంపుదలతో జపానుకు సముద్రాధిపత్యం లభించింది. భారత దేశాన్నుండి బర్మాకు సరియైన రోడ్లు లేవు. ఇందుచే మిత్రమండలి సైన్యాలకు అవసరమైనంతగా ఆయుధాలు, ఇతర వస్తువులు అందలేదు.

వలస దేశాల్లోని సైన్యాలకు బ్రిటను నుండి ఆయుధాలు సప్లయి చేస్తా మనుకోడం, బ్రిటిషు సామ్రాజ్యవాదుల వెర్రితనం. ఏ దేశానికి కావలసిన ఆయుధాలు ఆ దేశంలోనే తయారు కావాలి. వలస దేశాలను తమ పరిశ్రమలకు కావలసిన ముడి సరుకులను పండించడానికి తమ పారిశ్రామిక వస్తువులను అమ్ముకోడానికి వ్యవసాయక దేశాలుగా మాత్రం వుంచి వలస దేశాల పరిశ్రమల అభివృద్ధిని నిరోధించింది. బ్రిటిషు సామ్రాజ్యవాదుల హ్రస్వదృష్టియే.

యుద్ధం ప్రారంభమయినాక గత 3 ఏండ్లు గాకుండా సామ్రాజ్యవాదులీ పాలసీని మార్చలేదు. తత్ఫలితంగా ప్రధాన యుద్ధ సామగ్రిని తయారు చేసే ముఖ్య పరిశ్రమలు యిచట లేవు.

(6) మిత్రరాజ్యాల సైన్యాల ఓటమికి కారణభూతమైన మరొక ముఖ్యాంశాన్ని యే సేనానాయకుడూ పేర్కొనలేదు. అది, ఇది మిత్రమండలి సైనిక దళాల్లో అధిక భాగమైన భారత సైనికులు, బర్మా సైనికులు, దేశాభిమాన ప్రేరితులేగాని, ఏదో మహత్కార్య రక్షణకు పోరాడుతున్నామనే ఉద్రేకంతోగాని పోరాడలేదు. ఏదో తమ జీతపురాళ్ళను యజమానికి పనిచేసే అద్దె సైన్యాల మనస్తత్వమే వారిలో వుంది. జపాను సైన్యాలు ఆసియా ఖండంమీద జపాను యొక్క ఏక ఛత్రాధిపత్యం స్థాపించాలనే జాతీయ దురహంకారంతో పోరాడారు.

బర్మాలో మిత్రరాజ్య ఓటమికి ప్రధాన కారణాలలో మొదటిది ప్రజల సానుభూతి లేకపోవడం; రెండవది భారత, బర్మా సైనికులలో ఏదో మహత్కార్య సాధనకు పోరాడుతున్నామనే భావం లేకపోవడం, మిత్ర రాజ్యాలకు, అటవీ రాప్రాంతాలకు పనికివచ్చే తేలిక టాంకులు, ఫిరంగీలు, లేకపోయినా, తగినంత విమాన సహాయం లేకపోయినా, తగినంత ఆయుధ సామగ్రి సరఫరా చేయలేకపోయినా, ప్రజల సానుభూతి, వలస దేశ సైనికులలో దేశ భక్తి వుంటే, దేశాన్ని వదలి రావలసిన గతి పట్టేది గాదు. తాత్కాలికంగా కొంత భూభాగం మాత్రం జపాను హస్తగత మయ్యేది. బర్మాలో వివిధ జాతీయ పార్టీలతో గూడిన జాతీయ ప్రభుత్వ మేర్పరచి, యుద్ధ నిర్వహణను ఆ ప్రభుత్వం చేతిలో వుంచి యుండిన ప్రజలలో పలుకుబడి గలిగిన డోబామా పార్టీ జపానుతో కలిసిపోయేది గాదు. ప్రజా నాయకులతో రాజీపడి ప్రజల సానుభూతిని సంపాదించుటకు బదులు, బ్రిటిషు సామ్రాజ్యవాదులు యూసా మొదలైన ప్రజా నాయకులమీద తీవ్ర నిర్బంధ విధానం అమలు జరిపారు. ప్రజలలో అసంతృప్తి పెచ్చు పెరిగి పోయింది. ప్రజలు జపాను బూటకపు ప్రచారానికి మోసపోయారు. ప్రజలలో అధిక భాగం జపానుకు సానుభూతిని చూపారు. పై జెప్పినట్లుగా ఈ విషయాన్ని చాలవరకు బ్రిటిషు సైన్యాధికారులే అంగీకరించారు. ఆధునికాయుధాలు లేకపోయినప్పటికీ, అపార ఆధునికాయుధసంపదగల జపాను సైన్యాన్ని 4 సంవత్సరాలు ఏకాకిగా ఎదిర్చి దినదినాభివృద్ధి గాంచిన చిరస్మరణీయమైన చైనా చరిత్ర మనకు గుణపాఠం నేర్పుతోంది. అక్కడ ప్రభుత్వం ప్రజలకు సంబంధించిన దగుట చేతను, ముఖ్యంగా సైన్యం ఒరిజనల్ దగుట చేతనే అది సాధ్యమయింది.

సేనానాయకులు తమ స్వానుభవం వల్ల ఈ గుణపాఠాన్ని నేర్చుకున్నా, బ్రిటిషు రాజకీయవేత్తలు నేర్చుకున్నట్లు కనిపించదు. కనుకనే నిజమైన అధికారాన్ని భారత ప్రజలకివ్వ నిరాకరించి, క్రిప్సు రాయబారాలను విఫలంజేశారు. అంతటితో ఆగక శుద్ధమైన దేశభక్తులను అరెస్టు జేయుట, కాంగ్రెసు సంఘాల ఆఫీసులను సోదాలు చూచుట మొదలైన తెలివితక్కువ పనులు జేస్తూ, జపాను జర్మను రేడియోల విష ప్రచారానికి దోహదమిస్తున్నారు. ఇది పంచమాంగ దళంవారి దుష్ప్రచారానికి, శుద్ధ జాతీయవాదులను గూడా ఫేసిష్టు వ్యతిరేక ఉద్యమాన్నుండి తరిమివేయుటకు తోడ్పడుతోంది. కనుక ప్రభుత్వం జాతీయ కాంగ్రెసుమీద, ఇతర ఫేసిష్టు వ్యతిరేక సంస్థలమీద తమదాడిని మానాలి. ఫేసిష్టు వ్యతిరేక రాజకీయ ఖైదీల నందరినీ వెంటనే వదలివెయ్యాలి. వివిధ ప్రజా పార్టీల ప్రతినిధుతో గూడిన జాతీయ ప్రభుత్వ మేర్పరచి, యుద్ధ నిర్వహణను వారిచేతుల్లో ఉంచాలి. ప్రజలకాయుధాలియ్యాలి. దేశభక్తులు బ్రిటిషు ప్రభుత్వ ఉదారత్వానికై వేచి ఉండక, జపాను వ్యతిరేక ప్రచారాన్ని సాగించి ప్రజల్లో జపాను ప్రచారంవల్ల గల్గిన దురూహలను పోగొట్టాలి. కాంగ్రెసు ముస్లిములీగుల మధ్య సామరస్యానికి పాటుబడి జాతీయైక్యతను సాధించాలి. అప్పుడు బ్రిటిషు ప్రభుత్వం లొంగక తప్పదు.

ప్రభుత్వం బర్మాయుద్ధాన్నుండి మరొక గుణపాఠాన్ని నేర్చుకోవాలి. ఇప్పుడు భారత దేశములోనున్న బ్రిటిషు, భారతీయ సైనికుల యడల సద్భావంలేదు. తాము ప్రజలను అణచిపెట్టుకుని బ్రిటిషు ప్రభుత్వంచే మేపబడుతున్నామనే భావం వారిలో జీర్ణించి ఉండుటయే సైనికులు స్త్రీలను అవమానకరంగా చూడటం, షాపుల్లో దౌర్జన్యంగా వస్తువులను లాక్కోవడం, ప్రజలను అకారణంగా కొట్టడం, రైళ్ళలో జాగా అంతా ఆక్రమించుకుకూర్చుని చోటియ్యమన్న వారిని తన్నడం మొదలైన ఎన్నో సంఘటనలు రోజూ పత్రికల్లో చదువుతూనే ఉన్నాం వదంతులు వింటున్నాము సైనికుల్లో ఈ మనస్తత్వంపోయి, తాము దేశరక్షణ కొరకై పోరాడుతున్నామనే ప్రజలుతమ సోదరులేననే భావం వారిలో కల్గేవరకూ వారిమీద ప్రజలకున్న ద్వేషంపోదు. అందుకు వెంటనే సైనికులు ప్రజలమీద జరిపే అత్యాచారాలు మాన్పడానికి తగు చర్యలు తీసుకోబడాలి. సైనికులు జీతాలు హెచ్చించాలి. తెల్లసైనికులు నల్లసైనికుల మధ్య చూపబడే తారతమ్యము పోవాలి. అందరు సమానంగా చూడబడాలి.

చందా దార్లకు

చందా దార్లు తమ అడ్రసు మార్పులను గురించిగాని, మరి ఏ ఇతర వివరాల కోసంగాని వ్రాసేటప్పుడు తమ చందా నెంబరును తెలియజేస్తూ వుండాలి. లేకుంటే అనవసర ఆలస్యం జరుగుతుంది.

— మేనేజరు.

దివితాలూకాలో వ్యవసాయ కూలీల అరెస్టులు

చల్లపల్లిలో 13 గురు, మంగళాపురంలో 17 గురు అరెస్టు చేయబడ్డారు.

చల్లపల్లి ఎస్టేటులో అరణ్య భూమిని 1938 సం॥లో మంగళాపురం ముత్రాసలకు 70 కుటుంబాలకు, ఒక్కొక్క కుటుంబానికి 45 సెంట్లు చొప్పున రు 8—0—0 చొ॥ శిస్తు రేటుతో యిచ్చి వున్నారు. అప్పటినుంచి యింతవరకు ముత్రాసలు ఆ భూముల్ని సేద్య చేసుకుంటున్నారు. ప్రస్తుతం వారు పెట్టుకున్న పాదులు కూడ వున్నాయి.

కాని ఈ సంవత్సరం ఎస్టేటువారు ఆ భూముల్ని తమ వశం చేసుకోడానికి ప్రయత్నించగా ముత్రాసలు పోయి ఎస్టేటువారితో మొరపెట్టు కున్నారు. అయినా ఎస్టేటువారు లెక్కజేయక భూములను స్వాధీనం చేసుకోడానికి పూనుకున్నారు. ఈ భూమితప్ప ఆ బీద కూలీలకు వేరే జీవనాధారం లేదు. అందుచే వారు తమ భూములను రక్షించుకొంటూ తమ న్యాయమైన హక్కులను కాపాడుకుంటున్నారు.

ది 2-7-42 తేదీన పోలీసులు వెళ్ళి పొలంలోను, ఇండ్లవద్ద వెతికి మొత్తం17 గురును అరెస్టు చేశారు. వీరిలో స్థానిక ఆర్గనైజరు అయిన నిడమానూరు కోటయ్యగారుకూడా వున్నారు. ఈ అరెస్టులు చేయడంలో పోలీసువారిప్రక్కనే ఎస్టేటు నిఘామానులు వుండి ఎవరెవరిని అరెస్టు చేయాలో చూపి అరెస్టు చేయించారు. మంగళాపురం మున్సబు కోటయ్యగారిపై దౌర్జన్యం కూడా చేశాడు.

ది 1—7—42 తేదీని చల్లపల్లిలో జిల్లా వ్యవసాయకూలీ ఆర్గనైజరు చల్లపల్లి నారాయణరావుగార్ని, దివితాలూకా వ్యవసాయ కూలీ సంఘ ప్రెసిడెంటు, జాన్ పీటరుగార్ని మరి 15 గురు వ్యవసాయ కూలీలను అరెస్టు చేశారు. చల్లపల్లిలోని బంజరు భూములను సాగుచేసుకొనుటకు పోగా వీరిని అరెస్టు చేశారు.

ఈ అరెస్టు చేయబడిన వారందరిని ఆ రోజున తిండి పెట్టకుండా చల్లపల్లి పోలీసుస్టేషనులో ఒక చిన్న కొట్టులో కుక్కివుంచారు. వుచ్చ పోసుకోడానికి కూడా బైటికి తీయలేదు. నారాయణరావుగారిని బాధపెట్టారని కూడా తెలుస్తోంది. మరునాడు అవనిగడ్డ సబ్ జైలుకు తీసుకుపోయారు. మరల అక్కడినుండి బందరు సబ్ జైలుకు మార్చారు.

అవనిగడ్డ సబ్ జైలులో వుండగా వారిని ఇంటర్వ్యూ చేయడానికి, దివి తాలూకా రైతు సంఘ ప్రధాన కార్యదర్శి కంఠంనేని గోపాలరావు, కోనేరు రాజగోపాలరావు, సనకా బుచ్చికోటయ్యగార్లు వెళ్ళగా అవనిగడ్డ మేజస్ట్రేటుగారు నిరాకరించారు.

అరెస్టు చేయబడిన ఈ వ్యవసాయ కూలీలకు డిఫెన్సు వగైరా ఏర్పాట్లన్నీ చేయడానికి, దివితాలూకా రైతుసంఘం 5 గురు గల ఒక డిఫెన్సు కమిటీని నియమించింది. ఈ కమిటీవారు జిల్లా కలెక్టరుగారితోను, డిప్యూటీ కలెక్టరుగారితోను వెళ్ళి మాట్లాడారు. చార్జిషీటు వివరాలు ఏమిటో తెలియకుండా తామేమీ చేయజాలమని వారుసమాధానంచెప్పారు.

* * *

పై అరెస్టుల సందర్భంలో శ్రీ కంఠనేని గోపాలరావు (దివితాలూకా రైతు సంఘ కార్యదర్శి) మేరుగు శ్రీరాములు (దివితాలూకా వ్యవసాయ కూలీ సంఘ కార్యదర్శి) గార్లు ఈ క్రింది ప్రకటన జేస్తున్నారు.

న్యాయమైన హక్కు కొరకు, ముత్రాసకూలీ సోదరులు చేస్తున్న సక్రమ శాంతియుత పోరాటమునకు అందరూ తోడ్పడ వలసిందిగా ప్రార్థిస్తున్నాము. గ్రామగ్రామాన సభలు జరిపి, ఎస్టేటువారి చర్యలను గర్హిస్తూ, ఖైదీలను వెంటనే విడుదల చేయమని, ఆహార దినుసులు ఎక్కువ ఉత్పత్తి చేయడానికి అవకాశం వున్న ఎస్టేటు బంజరు భూములనుకూడ సాగుకుయివ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానాలు చేసి మహజర్లు పంపాలి.

మునగాల ఎస్టేటులో జమీందారుఅక్రమాలు

మునగాల ఎస్టేటులో జమీందారుగారి అక్రమాలు పూర్వం వలెనే మళ్లీ సాగుతున్నాయి.

ఆకుపాములఅనే గ్రామంలో వూరిలో నుండి, రోడ్డునకు పోయే రాజబాటను, సుమారు 5 నెలల క్రిందట, జమీందారు మనుష్యులు మూసివేసి కంపకట్టినారు. దానిపై గ్రామస్థులంతా వెళ్ళి మునగాల పోలీసు స్టేషనులోను, జగ్గయ్యపేట తహసిల్ దారుగారికిని చెప్పుకున్నారు. వారు వచ్చి చూచి వెళ్ళారు. బెజవాడ సబ్ కలెక్టరుగారు కూడ చూచి వెళ్ళారు. కాని ఇంతవరకు జమీందారుస్వాధీనంలో నుంచి రాజబాటను విడిపించలేదు.

ఇప్పుడు జమిందారు మనుష్యులు సదరు బాటను పొలములో కలుపుకోడానికి త్రవ్వించి మట్టిని తోలుచున్నారు.

అదేగ్రామంలో రాజాగారి సావడి చుట్టూ కొత్త గోడ పెట్టడానికి పాత గోడలు పడగొట్టారు. 2 మాసముల నుంచి ఆ పడగొట్టిన రాయి, మట్టి వగైరాలు రాజవీధికి అడ్డుగా పడి వున్నాయి. కొత్త గోడలు ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియదు. వీధిలోనడవడానికి వీలులేకుండావుంది.

ప్రభుత్వోద్యోగులు స్వయంగావచ్చి చూచి వెళ్ళి కూడా ఇట్టి అక్రమాలను అరికట్టకపోవడం చాల అన్యాయం. బెజవాడ సబ్ కలెక్టరుగారు, జగ్గయ్యపేట తహసిల్ దారు గార్లు వెంటనే గ్రామస్తుల ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నాము.

—మహంకాళి పానకాలయ్యశర్మ.

రైల్వే కార్మికులలో ఎలా పనిచేయాలి ?

కామ్రేడ్ పోలేపెద్ది నరసింహ్వామూర్తి

ఇతరదేశాలలో వలెనే యిండియాలో కూడా రైల్వే కార్మికులు పారిశ్రామికంగానేమి, నిర్మాణాత్మకంగానేమి బలపడిన కార్మికులతో పాటుగా ప్రధాన స్థానం వహిస్తున్న శక్తిగా నుంటున్నారు. దేశంలో వివిధ రైల్వేలలోని పనివారల సంఘాలు యేప్పడి పని చేస్తున్నాయి. ఈ వివిధ సంఘాలను కలుపుకొని యేకబాటన నడుపుకుపోతూ, రైల్వే కార్మికులను నిర్మాణయుక్తమైన దేశవ్యాపిత శక్తిగా తయారు చేయుటకుగాను ఒక కేంద్రసంస్థ అఖిలభారత రైల్వే మెన్స్ ఫెడరేషన్ వున్నది. కాని దాని నాయకత్వం అనుబంధ సంఘాలకు వాటి యొక్క రోజువారీ నిర్మాణ సమస్యలను గురించి, పనివారల హక్కులవిషయమై సాగించవలసిన రోజువారీ ఆందోళనాన్ని గురించి యెప్పటికప్పుడు సరియైన కార్యక్రమాన్ని చూపక వాటిదిక్కుకు వాటిని వదిలేసి కార్యశూన్యత వహిస్తున్నది. జి. ఐ. పి. ఎస్. ఐ. ఆర్. లేబర్ యూనియన్లు ఎమ్. ఎస్. ఎమ్. యూనియనులోని కొన్ని శాఖలు మొదలగు కొద్ది సంఘాలు తప్ప, మిగతా సంఘాలన్నీ నిర్మాణయుక్తమైన బిగువేమీ లేకుండా బలహీనంగా నుంటున్నాయి. దీనికి కారణం యీ సంఘాలమీదనేమీ, వీటిని నడుపుతున్న అఖిలభారత సంస్థ మీదనేమి, పనివారల ఐక్యతా బలాన్ని ఆందోళనా బలాన్ని పెంపుచేయు నాయకత్వం లేకపోవటమే. నాయకత్వం పనివారల ఆందోళనా పోరాటాల ఆవశ్యకతను గుర్తించి నప్పుడే సంఘాలను నిర్మాణాత్మకంగా బలిష్ట మొనర్చుటకు కృషిసాగిస్తుంది. కార్మికవర్గ ఆశయములను దృష్టిలోనున్న కార్మిక శ్రేయోభిలాషులు స్పష్టమైన నిర్మాణ కార్యక్రమం ప్రకారం ఆ సంఘాలు పని చేస్తుండేట్టు చూడాలి.

కేంద్ర కార్యనిర్వాహక వర్గం

రైల్వే కార్మిక సంఘాలు రైల్వే కార్మికుల హక్కుల సంపాదన కొరకు పోరాడే ప్రజా సంఘాలు కాబట్టి అట్టి సంఘాలు ఆంతరంగిక ప్రజా స్వామ్య సూత్రం (Principle of inner democracy) న్ననుసరించి పని చేయలేక పోయినట్టయితే పనివారలలో వారి పోరాటానికీ అవసరమైన చొరవ, ధైర్యము, వుత్సాహము, ఆత్మ విశ్వాసము పెంపొందవు. ఆంతరంగిక ప్రజా స్వామ్య సూత్రం అంటే నేమిటి ? యూనియన్ యొక్క కేంద్ర కార్య నిర్వాహక వర్గం, తానొక అధికారి సభ్యులైనవారు తనకు అణిగి, మణిగి పడివుండాలనే నిరంకుశ ధోరణిని వదిలేసి, స్థానికంగా, యెక్కడికక్కడ పనివారలకు దగ్గరగా నుండే శాఖలతోటి సన్నిహిత సంబంధంలో నుంటూ, అనువైన కార్యక్రమము యిస్తూ వుండటం, రోజువారీ పనిలోని సాధక బాధకాలను తెలుసుకుంటూ వాటి నివారణోపాయానికి మార్గాలనుచూపుతూ నుండట, తన విధానంపై, తీర్మానాలపై అవి యిచ్చే విమర్శనలను, అభిప్రాయములను దృష్టిలోకి తీసుకోవడం. రోజువారీ స్థానిక వర్కులో పనివారల ఆశయాలకు హానికరముగా లేనంతవరకు వాటికి స్వతంత్ర చొరవ, స్వేచ్ఛలను ఒసంగటం — ఇది; ఆంతరంగిక ప్రజాస్వామ్య సూత్రం. నాయకత్వం యీ సూత్రాన్ని అమలుపర్చనిదే సంఘంలో జీవం వుండదు. ఎంతసేపటికి పనివారలు తమకు ఏనాథుడో ఒకడు తన పనినంతా చేసిపెడతాడనే తప్పుడు భావంలో నుంటారేగాని తమ బలంద్వారా తాము హక్కులను సంపాయించుకోవా లనే భావముండదు. కార్యదీక్ష పెంపొందదు. పనివారలేమి, స్థానికంగా వారిని నడిపే శాఖలేమి ప్రతి చిన్న విషయానికి కేంద్ర కార్య నిర్వాహక వర్గం యొక్క సలహా కొరకు యెదురు చూస్తూండడం సంఘం యొక్క అభివృద్ధికి లక్షణం కాదు.

సెంట్రల్ ఆర్గనైజర్ ఆవశ్యకత

శాఖలన్నీ రోజువారీ కార్యక్రమంలో నిమగ్నులై పని చేస్తు వుండేవాటినిగా తయారు చేయుటకుగాను కేంద్ర కార్య నిర్వాహకవర్గం తరఫున సెంట్రల్ ఆర్గనైజర్ నియమింపబడి, అతడు శాఖలన్నిటికి వెళ్ళుతూ, అవి సాగిస్తున్న వర్కును తనిఖీ చేస్తుండటం, వాటి కార్య నిర్వాహక వర్గములను సమావేశపరచి అనుదినం చేయాల్సిన పనికి అవసరమైన కార్యక్రమమును యివ్వటం, కార్యనిర్వాహక సభ్యులకు పనిని విభజించటం, ప్రచారానికిగాను బహిరంగ సభలను పెడుతుండటం, శాఖలయొక్క అకౌంట్లను సరిచూడటం, అన్ని శాఖల వర్కు రిపోర్టును కేంద్ర కార్యనిర్వాహక వర్గానికి యివ్వటం మొదలగు పనులను నెరవేరుస్తుండాలి.

కేంద్ర రిపోర్టులు

కేంద్ర కార్యనిర్వాహకవర్గం ప్రతి నెలా అన్ని శాఖలయొక్క పనిని రిపోర్టుగా తయారుచేసి, దానిని అన్ని శాఖలకు పంపించవలెను. అలాంటి రిపోర్టు నుంచి ఒక శాఖయొక్క పనిని మరియొక శాఖ తెలుసుకొని దానిలోని గుణపాఠాలను నేర్చుకుంటుంది. అంతే కాకుండా శాఖలన్నీ మొత్తపు యూనియన్ పనినంతాతెలుసుకొని యూనియన్ అంతా యేవిధంగా ఆక్టివైజ్ అవుతున్నది. తెలుసుకుంటాయి తీవ్రంగా పనిచేస్తున్న శాఖలవలె తాముకూడా పని చేయటానికి పూనుకుంటాయి. (ఇంకావుంది)

గమనించండి !

పత్రికా కార్యాలయానికి సంబంధించిన ఉత్తరాలను వ్యక్తుల పేరిట వ్రాయవద్దు. సంపాదకులకు సంబంధించిన విషయమంతా సంపాదకుని పేరిట వ్రాయాలి. బిజినెస్ కు సంబంధించిన దంతా మానేజరు పేరిట వ్రాయాలి. వ్యక్తిగత విషయాలుంటే "పర్సనల్" అని వ్రాయాలి. మానేజరుకు, సంపాదకులకూ సంబంధించిన విషయాలను కలుపరాదు.

—మేనేజరు.

ప్రజా యుద్ధం

కామ్రేడ్ కంభంపాటి సత్యనారాయణ, ఎం. ఎ.

(బొబ్బిలిపాటవరుస)

జయము జయము మన భారత భూమికి జయము దిగ్విజయము
జయము జయము మన ప్రజాశక్తులకె జయము దిగ్విజయము

1. అసలీ యుద్ధం — ఎటులొచ్చిందని — అడుగుతారుమీరు
పరాకపడక — నిరాశవదలి — బిరానతెలియండి.

2. ప్రపంచమందలి — పేదప్రజలను — పీడించాలంటు
బ్రిటీషురాజ్యము — జర్మనురాజ్యం — పోటీపడ్డాయి.

తమ వ్యాపారం — తమ వర్తకమూ
తమపెట్టుబడీ — తమఫ్యాక్టరీల్
తమదు బ్యాంకులు — తమదు కంపెనీల్
తమ లాభాలు — తమ భోగాలు

3. ఇవన్నియును — ఎప్పటి కప్పుడు — ఎక్కువవాలంటే
ఇండియవంటి — ఇంకాదేశా — లవసరమేకాదా?

4. అయితే తమ తమ — ఆస్థుల నెవ్వరు — అడిగితె యిస్తారు ?
కనుకనె బ్రిటనుకు — జర్మనీకినీ — లడాయి పడినాది. భళాభళీ॥

5. రెండున్నర యేం — డ్లయింది రెండూ — ప్రభుత్వవర్గాలు
యూరపునంతను — యుద్ధ జ్వాలలో — భస్మంజేశాయి.

ఎక్కడ చూచిన — రక్తపుటేరులె
ఎక్కడ గాంచిన — హాహాకారాల్
ఎక్కడ విన్నా — ఆర్తనాదమే
ఎక్కడ గన్నా — రోదన శబ్దం.

6. ఇక్కడక్కడని — భేదంలేకా — ఈ యుద్ధంలోన
యూరప్ అంతా — జర్మనురాక్షసి — జెండా ఎగిరింది.

పోలండు దేశము — పుట్టిమునిగెను
హాలండు దేశం — ఆఖరయిందీ
బెల్జియ మదిగో — పీటీ అయ్యెను
ఫ్రాన్సు దేశము — పతనం బయ్యెను
గ్రీసు దేశము — గిర్రున పడియె
యుగోస్లోవియా — ఓడిపోయెనూ
స్పెయిన్ ఆస్ట్రియా — జకోస్లోవులను
అంతకుపూర్వమె — అణచివేసిరి.

7. ఎన్నో దేశా — లీయుద్ధములో — ఎగిరిపోయినాయి
ప్రపంచమంతా — ప్రచండమైన — ప్రళయమావరించె. జయము॥

8. సామ్రాజ్యాల — యుద్ధములో తా — జేరక నిలబడినా
బానిస అయినా — భారత దేశం — పట్టి ఈడ్వబడెనూ.

9. ప్రభుత్వంబులు — పచ్చిదోపిడికై — పోటీపడుతూంటె
బానిస ప్రజలు యే — ప్రక్కను జేరిన — ప్రయోజనంబేమి?

10. భారతప్రజలీ — భావమునెరిగి — వాటితొ జేరకను
స్వాతంత్ర్యముకై — పోరుసల్పగా — సిద్ధంఅయ్యారు. ॥భళాభళీ॥

॥ అపుడు యూరప్ను జయించడంతోటే హిట్లరుకు ప్రపంచంమీద పెత్తనము రాలేదు. బ్రిటను తనకు లొంగలేదు. రష్యా పక్కలో బల్లెంగావుంది. ఇదంతా చూచి, తనకు సులువుగా వచ్చిన విజయాలతో కన్నుగానక, దుర్మదాంధుడు హిట్లరు ఏం చేశాడయా అంటే,—

11. అప్పుడు హిట్లరు — అట్టహాసముతొ — హుంకరించెనాడు
రైతు కార్మికుల — రాజ్యంబైన — రష్యాపై బడియె.

12. రష్యా అంటే — ఏదొ చిన్న — రాజ్యము గాదండీ
ప్రపంచ మందలి — ఆరవ భాగం — ప్రముఖ దేశమండీ

13. విశాలమగు యీ — ప్రశాంత దేశము — నశింపవలెనంటు
పిశాచి హిట్లరు — విశేషమైన — ఆశతొ యెదిరించె.

14. ఇరవైఅయిదు — ఏండ్లక్రిందట — ఇంచు మించుగాను
సోవియట్ రష్యా — సోషలిజాన్ని — స్వీకరించెనండీ ॥భళాభళీ॥

15. సంపదలన్నీ — శ్రమ జీవులకే — సంక్రమించెనండి
భాగ్యవంతుల — భోగ భాగ్యముల్ — ప్రజలకు వచ్చాయి

16. రష్యాయందు — రైతు కార్మికులు — రాజ్య మేలుచుండ
అధికారంబు — అక్కడి ప్రజలదె — ఆశ్చర్యం కాదా!

"గాంధీజీతో నేనెందుకు విడిపోయాను ?"

సర్దారు పృథ్వీసింగ్ ప్రకటన

"హరిజన్" పత్రికలో గాంధీజీ వ్రాసిన వ్యాఖ్య చూచిన తరువాత చాల మంది మిత్రులు, అభిమానులూ గాంధీజీతో నేను విడిపోడానికి కారణం ఏమిటని తెలియ జేయమని కోరుతూ జాబులు వ్రాస్తున్నారు.

నేను నా చిన్నతనంలోనే భారత స్వాతంత్ర్యం కోసం నా జీవితాన్ని ధార పోయాలని నిశ్చయించుకున్నాను. 1914 లో నాకు ఉరి శిక్ష విధించబడింది. తరవాత అది యావజ్జీవ ద్వీపాంతరవాస శిక్షగా మార్చబడింది. 1922 లో జైలు నుండి తప్పించుకుపోవాలని చేసిన నా రెండో ప్రయత్నం ఫలించింది. అప్పటి నుంచి 1938 వరకు పట్టుబడకుండా రహస్యంగానే వుంటూ వచ్చాను. 1938 లో గాంధీజీకి నా అంతట నేను వశమయ్యాను. 17 మాసాలు తిరిగి జైలులో గడిపిన తరువాత, గాంధీజీ నాకు విడుదలను సాధించిపెట్టాడు. గడిచిన మూడు సంవత్సరాలలోను, ఆయన ననుసరించి దేశానికి సేవ చేయాలని ప్రయత్నించాను. ఆయన నాయెడల యెంతో ప్రేమను, నమ్మకాన్ని చూపాడు. దానికి నే నాయనకు కృతజ్ఞత అందజేస్తాను. ఆయన క్రింద నేనొక శిక్షిత సైనికునిలా పని చేశాను. గాంధీజీ అహింసా విధానం ఏమిటో తెలుసుకుని పని చేయడానికి నా శక్తికొలది ప్రయత్నించాను.

కొలది కాలం క్రిందట యుద్ధ పరిస్థితిలో వచ్చిన మార్పులు, అందరు దేశభక్తులకుమల్లేనే నన్ను కూడ కదలించివేశాయి. క్రూరుడైన హిట్లరు సోవియటు యూనియన్ పై దండెత్తినపుడు నేను చాల బాధపడ్డాను. గాంధీజీ, జర్మన్ ఫాసిజమూ, బ్రిటిషు సామ్రాజ్యవాదమూ సోవియటు యూనియను ఈ మూడిటిని ఒకే త్రాసులో పెట్టడంచూసి నేను సహించలేకపోయాను. రెండోది, జపాను దండయాత్రపై గాంధీజీ అభిప్రాయం నాకు మరింత అసంతృప్తి కలిగించింది. జపాను దండెత్తివస్తే, గాంధీగారి అహింసావిధానం సూచించే కార్యక్రమం ఆచరణలో జపానును ఎదుర్కోకుండా వూరుకోవడమే అవుతుంది. అంటే గాంధిగారి పాలసీ ప్రాచీనమై, చారిత్రాత్మకమైన మన మాతృదేశాన్ని నాశనం చేసుకోవడమే అవుతుంది. ఎంతో దీర్ఘంగా ఆలోచించి నేను గాంధీజీనుండి విడిపోడానికే నిశ్చయించుకున్నాను.

మాతృదేశ భక్తి నాకొక విషయాన్ని ప్రబోధించుతోంది. నేడు మన మొక మానవ జాతిగా బ్రతకాలంటే, ప్రతి భారతీయుడూ ఏ విధంగానైనాసరే, యే పద్ధతులలోనైనాసరే సర్వతోముఖమైన ఫాసిస్టు ప్రతిఘటనకు పూనుకోవాలి. మన దేశాన్ని రక్షించుకోడానికి ప్రధానమైన కర్తవ్యం, జాతీయ ఐక్యత సమకూర్చడం అని నేను గుర్తించాను. దేశభక్తులందరూ, దేశంలోని సంఘాలన్నీ ముఖ్యంగా కాంగ్రెసు ముస్లిం లీగులు— యీనాడు ఐక్యం కావాలి.

ఈ ఐక్యత సమకూర్చడంలో మనం యెంత విజయవంతులమైతే జాతీయ ప్రభుత్వం మనకి అంతదగ్గరకు వస్తుంది. జాతీయ ప్రభుత్వం క్రింద మనం నిర్మించుకునే ఫాసిస్టు వ్యతిరేక సంయుక్త జాతీయ ప్రతిఘటన మన దేశాన్ని రక్షించడమే కాకుండా మన స్వాతంత్ర్యానికి కూడా దారి తీస్తుందని నాకు గట్టి నమ్మకం. అట్టి పోరాటంలో మనకు అండగా స్వాతంత్ర్యాభిలాషులైన దేశాల సహాయం, బలోపేతమైన సోవియట్ యూనియను, వీరచైనా దేశాల సహాయం వున్నాయి.

ఈ యుద్ధం మన యుద్ధంగా పరిగణించవలసిన సమయంలో గాంధీగారి పాలసీ, మన దేశ ప్రజలను ఈ యుద్ధానికి దూరంగా వుంచాలంటూ వుంది. నాకీనాడు ఒక్క విషయం స్పష్టంగా కనబడుతోంది. అది యేమంటే, మనం యీ యుద్ధాన్ని మన యుద్ధంగా పోరాడితేనే మనకు స్వాతంత్ర్యం లభిస్తుంది, లేకుంటే ఫాసిజమే మనకు గతి అవుతుంది. అందువల్ల నేనిక గాంధీజీ అనుచరుడుగా వుండలేను."

[కామ్రేడ్ పృధ్వీసింగును గురించి బాగా తెలుసుకోవాలంటే 1938 జూన్ 12, 19 తేదీల "నవశక్తి" పత్రికలు చదవండి.]

—★—

జమీందారుల — జాడయే లేదు
పూంజీపతులూ — పతనమయ్యిరి
ఆకలి బాధ — అంతరించెను
నిరుద్యోగము — నాశనమయ్యెను
దరిద్రమంతా — దగ్ధమయ్యెను
సంపద లన్నీ — సమిష్టి అయ్యెను
ప్రజలను దోచే — పద్ధతి పోయి
హాయిగ బ్రతికే — హక్కులు వచ్చె.

17. సమస్త జనులకు — స్వర్గ మెక్కడని — సవాలు చేస్తేను
సోవియట్ వైపు — చూడండీ ఓ — సుజనులార మీరు,
॥జయము జయము॥

(ఇంకావుంది)

ప్రెస్ వర్కర్సు

బెజవాడ ప్రెస్ వర్కర్సు యూనియన్ పంచమ వార్షికోత్సవము కామ్రేడ్ ఎం. రాధాకృష్ణ, ఎం. ఏ., (ఆంధ్రరాష్ట్ర విద్యార్థి సంఘ ప్రధాన కార్యదర్శి) గారి అధ్యక్షతను 28-6-42 వ తేదీన జరిగెను.

ఉదయం ఊరేగింపుతో బయలుదేరి ప్రెస్ వర్కర్సు యూనియన్ వద్ద పతాకోత్సవము జరుపబడెను. కామ్రేడ్ కె. సత్యనారాయణగారు పతాకోత్సవమును జరిపిరి. గం॥ 8—30 లకు కామ్రేడ్, పేట రామారావుగారు కామ్రేడ్ చాపరాల వెంకటేశ్వరరావుగారి ఛాయాపటమును బహిరంగపరచిరి.

తీర్మానములు

1. ఆంధ్రరాష్ట్ర ప్రెస్ కార్మికుల సంఘ స్థాపనకు పునాదియై, రాష్ట్ర కార్మికులలో చైతన్యం పెంపొందించి, కష్టాలను తీర్చుటకు పూనుకొనిన కామ్రేడ్ పిల్లలమర్రి వెంకటేశ్వర్లుగారు తమ ఫాసిస్టు వ్యతిరేకదృక్పధాన్ని వెలిబుచ్చినా ఆరోగ్యం చెడిపోయి, యెంతో దుర్భర జీవితం గడుపుతున్నా, యెన్ని అర్జీలు పెట్టినా, ప్రభుత్వం వానిని నిర్లక్ష్యపరచి, ఆయనను యింకా విడుదల చేయని మద్రాసు ప్రభుత్వంవారి చర్యన్ను ఖండించుచు, వారిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వమునుకోరుచున్నాము.

2. తమ ఫాసిస్టు ప్రతికూల దృక్పధాన్ని స్పష్టంగా తెలియపరచినా, కొంతమంది డిటెన్యూలను విడుదలచేసి, మరి కొంతమందిని విడుదల చేయని ప్రభుత్వ సంకుచిత విధానానికి విచారించుతూ, వెంటనే వారి నందరినీ గూడ విడుదల చేసి, ఫాసిస్టు ప్రతికూల ప్రచారాన్ని అభివృద్ధగునట్లు వీలు కలుగచేయవలెనని ప్రభుత్వం వారిని కోరుచున్నారు.

3. పట్టణంలో గల అన్ని ప్రెస్సుల లోను రోజుకు 8 గంటల పనే అమలులో నున్నా, యిన్ని సంవత్సరముల నుండి ఆందోళన చేస్తున్నా, ఆంధ్ర గ్రంథాలయ, విజయా, కన్యకా ప్రెస్ లలో 8 గంటల పనిని అమలు పరచకపోవడం అమానుషమని, వెంటనే యిక నుండి, అన్ని ప్రెస్సులలోవలె ఆ మూడు ప్రెస్సులలో గూడ 8 గంటల పనే అమలు జరపాలని యజమానులను కోరుతూ, ఆ ప్రెస్సులలోని కార్మికులు 8 గంటల హక్కును పొందుటకు ప్రయత్నించవలసినదిగా కోరుచున్నారు.

4. ప్రభుత్వం అన్ని శాఖలలోను, తద్వారా యితర అన్ని సంస్థలలోను, వారి కార్మికులకు, యితర ఉద్యోగులకు క్యాజుయల్ సెలవు, ప్రివిలేజి సెలవు, యింక సిక్కు లీవు అమలులోనున్నాయి. యితర మానవులకు వలెనే ప్రెస్ కార్మికులకు సెలవులు అవసరమనీ గుర్తించి వెంటనే అన్ని ప్రెస్సుల యజమానులు యీ క్రింది విధంగా సెలవులు మంజూరు చేయవలెనని కోరుచున్నారు.

కాజుయల్ లీవు — 15 రోజులు;

సిక్కులీవు — 15 రోజులు;

(జీతంమీద)

5. యుద్ధం ప్రారంభంనుండి అవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయినాయి. దానికి అనుగుణ్యంగా యుద్ధ అలవెన్సు రు 1—0—0 కి 0—4—0 చొప్పున యివ్వవలెనని కోరుతున్నాం. మనతోపాటే ఆందోళన ప్రారంభించిన రైల్వే, మునిసిపల్ మొదలగు కార్మికులు రు 1—0—0 నుండి 4—0—0 వరకు యుద్ధ అలవెన్సు సంపాదించారు. ప్రభుత్వం తన క్రింది ఉద్యోగులకు యుద్ధ అలవెన్సు యిచ్చింది. మన సంఘ ఐక్యతను పెంపొందించి, మన వ్యక్తిగత యజమానులను ఒత్తిడి చేసి, మన కోరిక న్యాయమైనదని రుజువు చేసి, పెరిగిన ధరల కనుగుణ్యంగా యుద్ధ అలవెన్సు సంపాదించాలని, అట్టి పనికి వెంటనే అందరూ పూనుకోవాలని బెజవాడ ప్రెస్ కార్మికులను, ఈ సభవారుకోరుచున్నారు.

6. ఎన్ని సంవత్సరములు ఒకే ప్రెస్‌లో పనిచేసినా, పర్మినెంటు లేకుండా రోజు కూలీలవలె పని చేయుట చాల అన్యాయం. వెంటనే ప్రెస్ యజమానులు యిప్పుడున్న స్టాఫ్ నంతనూ—

(ఏ) పర్మినెంటు చేయాలనీ,

(బి) రిటైర్ కాబోయేటప్పుడు బోనస్ యివ్వాలనీ,

అట్టి హక్కులను పొందుటకు కార్మికులు తమలో ఐక్యతను పెంపొందించుకొని సమిష్టిగాపోరాడటానికై నాతయారుగావాలని కార్మికులను హెచ్చరించడమైనది.

కె. నారాయణస్వామి,

కార్యదర్శి.

డిటిన్యూలకు సన్మానం

విడుదలై వచ్చిన గుంటూరు జిల్లా డిటిన్యూలను సన్మానించుటకుగాను ది 30—6—42 తేదీ సాయంకాలం 6 గం॥లకు గుంటూరు గాంధీపార్కులో బహిరంగసభ జరుపబడినది సభకు 1000 మంది వచ్చారు. శ్రీయుత ఎ. వి. జి. కృష్ణమూర్తి, బి యే.బి.యల్‌గారు అధ్యక్షత వహించారు. డిటిన్యూలలో వాసిరెడ్డి శివలింగప్రసాద్, దుర్భా కృష్ణమూర్తి గార్లు ఉపన్యసించారు. ఫాసిష్టు వ్యతిరేక నినాదాలతో సభ ముగిసింది.

కృష్ణాజిల్లా మహిళా సంఘం, ఆఫీసు మార్పు

జిల్లా మహిళాసంఘ కార్యాలయం జమీగొల్వేపల్లినుండి బెజవాడకు మార్చబడింది. కాన ఉత్తర ప్రత్యుత్తరములు యీ క్రింది అడ్రసుకు పంపప్రార్థన.

శెక్రటరీ, కృష్ణాజిల్లా మహిళా-సంఘం,

గవర్నరుపేట—బెజవాడ.

కా॥ హనుమాయమ్మ. శెక్రటరీ.

వ్యవసాయ కూలీలు

పశ్చిమ గో॥ జిల్లా.

పశ్చిమ గోదావరిజిల్లా వ్యవసాయ కూలీస్థాయి సంఘం ది 23—6—42 తేదీని శ్రీ క॥ గ॥ మానియేలుగారి అధ్యక్షతను సమావేశమై ఈ క్రింది తీర్మానాలు గావించింది.

(1) గోదావరి పశ్చిమ, తూర్పుడెల్టాలకు ప్రపోర్షనేట్ డిశ్చార్జి పద్ధతిని నీటి సరఫరా ఏర్పాటు చేసినందువల్ల, పశ్చిమ డెల్టాలో నీటి కరువు ఏర్పడి తాగడానికి కూడా నీరులేక కొన్నాళ్ళు నీళ్ళ ఇబ్బంది కలిగింది. ఆకుమళ్ళు కొన్ని చచ్చిపోయాయి. అందుచేత ఈ పద్ధతి మాని వెనుకటి రీతినే నీటిసప్లై చేయవలసినదిగా ప్రభుత్వంవారిని కోరుచున్నాము.

(2) జిల్లాలోని బంజరు భూములను వ్యవసాయ కూలీలకు సాగుకు ఇచ్చుటతో పాటు వారికి కావలసిన పెట్టుబడిని ప్రభుత్వమే కో-ఆపరేటివ్ సంఘాలద్వారా ఇచ్చే ఏర్పాటు చేయాలని కోరుతున్నాము.

(3) ఈ సంవత్సరం అధికమాసం వచ్చినందు వల్ల ఆనెలకు కూడ తమ పాలేళ్ళకు జీతమివ్వవలసినదిగా రైతులను కోరుతున్నాము.

తూ॥ గో॥ జిల్లా.

రాజోలు తాలూకా వ్యవసాయ కూలీ మహాసభ ది 18—6—42 తేదీని గుడిమళ్ళంకలో జరిగింది. సభకు 70 మంది ప్రతినిధులు, 3000 మంది కూలీలు హాజరయ్యారు.

కామ్రేడ్ సి. హెచ్. నవరత్నంగారు అధ్యక్షత వహించారు. ఈ క్రింది ముఖ్య తీర్మానాలు చేయబడ్డాయి.

(1) దేశరక్షణకోసం ప్రతి గ్రామంలోను ప్రజా రక్షణ దళాలను ఏర్పాటు చేయడానికి తీర్మానించారు.

(2) వ్యవసాయ కూలీలకు పురుషునికి రోజుకు 5 శేర్లు ధాన్యంగాని 0-5-0 కూలిగాని, స్త్రీకి 4 శేర్లు ధాన్యంగాని, 0—4—0 కూలిగాని, యివ్వాలని రైతులను కోరుతున్నాము.

(3) బంజరు భూములు వ్యవసాయ కూలీలకే ఇవ్వాలి.

కదలిఫిర్కా వ్యవసాయ కూలీ ద్వితీయ మహాసభ ది 12—6—42 తేదీని పొన్నమండగ్రామంలో ఎన్. జగన్నాధంగారి అధ్యక్షతను జరిగింది. బంజరు భూములు కూలీలకివ్వాలని, ఆయుధ శాసనాన్ని రద్దుచేసి ప్రజలకు ఆయుధాలివ్వాలనీ అవంతిప్రెస్‌ను తిరిగి యిచ్చివేయాలని తీర్మానించారు.

గుంటూరు జిల్లా

ది 24—6—42 తేదీన జిల్లా వ్యవసాయ కూలీ కార్యనిర్వాహక వర్గం తెనాలిలో కామ్రేడ్ మావల వీరభద్రరావు గారి అధ్యక్షతను సంఘసమావేశమై యీదిగువ తీర్మానములు గావించింది.

ఎరువులు అప్పుగా యిచ్చుట

జిల్లా వ్యవసాయశాఖవారి ద్వారా ప్రభుత్వం సంవత్సర వాయిదాపైన ఎరువులు అప్పు యిచ్చుటకు నిర్ణయించినది. ప్రతి రైతు తనకు భూమి మీద వున్న హక్కును గ్రామ కరణం, లేక మునసబుల సర్టిఫికెట్టుతో రుజువు పర్చుకుని తను కట్టు నిస్తునకు అయిదు రెట్లు అప్పు తీసుకొను అర్హతగలిగియున్నాడు. జమీ, గవర్నమెంటు విభేదము లేదు! రు 25—0—0 లకు మించని దరఖాస్తులు వ్యవసాయశాఖా డిమాన్‌స్ట్రేటర్ల ద్వారానే మంజూరు కాబడును. అంతకు మించిన మొత్తములకు కలెక్టరుగారి మంజూరు కావలయును. యీ కార్యకలాపములో రైతు సంఘము, వ్యవసాయ శాఖ కాలయాపన జరుగకుండా చూడగలవు. యీ దరఖాస్తులకు నిర్ణీత ఫారములు కలవు. అవి రైతు సంఘము వారిద్వారాగాని, డిమాన్‌స్ట్రేటర్లద్వారాగాని దొరకును. ఎరువులు బజారులోని యే షాపులోనైననూ రైతు యిష్టప్రకారం ఎరువులు ఇప్పించుదురు. ఇందు విషయమైన సలహా, సహాయములు గ్రామ, తాలూకా, జిల్లా రైతు సంఘముల వలన పొందవలయును. ఈ తరుణములో ఆలశ్యము చేయక దరఖాస్తులు పెట్టుకొనవలయును.

మెట్ట ప్రాంతములవారు ముఖ్యంగా గుర్తించి, తగిన ఎరువులు తీసికొని లాభమును పొందగలరు.

అ॥ వెం॥ శ్రీ॥ రామారావు,

కృ॥ జి॥ రై॥ సంఘ కార్యదర్శి.

(1) 42 సం॥ ఫిబ్రవరి 1 వతేదీ మద్రాస్ ప్రభుత్వం పంటను అధికంగా పండిచాలనే ఉద్దేశ్యంతో సాగుకు బంజరు భూములు ఆక్రమించుకోవలసినదని ప్రకటించింది. అలాంటి భూమంతయు నిరుపేదలైన వ్యవసాయ కూలీలకే అందుబాటు చేయ్యాలని లోగడ యిచ్చిఉన్న భూములను మంజూరు చెయ్యాలని, జూన్ 10, 15 వ తేదీలల్లో తినుబండారములధరలు నిర్ణయించుటకై ప్రభుత్వం నియమించిన ధరల ఎడ్వైజరీ కమిటీవారి నిర్ణయం గ్రామాల్లో అమలు పరచే బాధ్యత స్వయంగా కమిటీవారే తీసుకొని ప్రజలకు సహాయ పడాలని, పై రెండు కమిటీలల్లో జిల్లా వ్యవసాయ కూలీ సంఘ ప్రాతినిధ్య ముండాలని, ప్రభుత్వాన్ని కోరుటకుగాను, జిల్లాకలెక్టరు వద్దకు జులై మొదటి వారంలో రాయబారం జరిపేదానికి కమిటీ ఒక ఉప సంఘాన్ని నియమించింది.

(2) గ్రామాల్లో ప్రభుత్వమే ధాన్యపు డిపోలు పెట్టించి ప్రజలకు సహాయపడవలసినదని స్థానిక రివిన్యూ అఫీసర్ల వద్దకు కూలీ ర్యాలీలు జరపాలి.

యస్. వి. మల్లికార్జునశర్మ, కార్యదర్శి.

చైనా జాతీయ ప్రతిఘటన

1937 జులై 7 వ తేదీన, జపాను ఫాసిష్టు హంతకులు చైనాపై యుద్ధం ప్రారంభించారు. జపాను, లుకేషియాలో రెచ్చగొట్టిన 'ఘటన'తోనే ఈ యుద్ధం ప్రారంభమయింది. జపాను ఈయుద్ధాన్ని ఇంకా 'ఘటన' అనే పిలుస్తూ వచ్చింది. కాని ఈ 'ఘటన' యే లక్షలాదిగా జపాను సేనల బలిగొన్నది. అయిదేండ్ల కాలం కొనసాగినది. జపానుకు విజయం మాట అటుంచి పరాజయంసమీపించింది.

ఈ అయిదేండ్లలో, చైనా సాటిలేని శౌర్యంతో, త్యాగంతో జపానుఫాసిజాన్ని అరికట్టింది. ఫాసిజానికి ప్రధమంలోనే బలియైనది చైనా, ఆనాటినుండి నేటివరకు ఒంటరిగా- తగిన ఆయుధ సాధన సంపత్తిలేకున్నను— ప్రాచ్య భాగమందలి ఫాసిష్టు ధాటినంతను భరించు తున్నది.

1937 సంవత్సరాంతానికి, పీపింగ్, షాంగే, నాంకింగ్ పట్టణాలు పడిపోయాయి. మరు సంవత్సరం కాంటన్, హాంకోలు పడిపోయాయి. ఈ విధంగా ఈ అయిదేండ్లలో ముఖ్యమైన పారిశ్రామిక కేంద్రాలు, రేవుపట్టణాలు, సముద్ర తీర పట్టణాలు, ముఖ్యమైన రైల్వేలు, జపాను చేతులలో పడి పోయాయి. దాదాపు సముద్ర తీరమంతా బంధింపబడింది. చాల భాగం ఆక్రమించబడింది.

ఆక్రమిత చైనాలో ప్రజలు హత్యలకు, దోపిళ్ళకు, చిత్ర వధలకు అవమాన పరంపరలకు గురికావలసివచ్చింది.

అయిదేండ్ల నుండి జపాను ఫాసిజాన్ని ప్రతిఘటించి, లక్షలకొలది చైనీయులను బలిగావించింది. ఎందుకొరకు? తమ జాతీయ స్వాతంత్ర్యంకోసం, తమ ప్రజా హక్కులకోసం, తమ జాతి అస్తిత్వం కోసం, ఇంతటి అద్భుత సాహసాలతో చైనా ప్రజలెట్లా పోరాడగలుగుతున్నారు. విదేశ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా, దీర్ఘంగా సాగించిన చైనా జాతీయోద్యమ పోరాటం పెంపొంది, యీనాడు సర్వతోముఖ జపాను ప్రతిఘటనా రూపం దాల్చుట వలననే. అట్టి జాతీయ పోరాట చరిత్రను సంగ్రహంగా చూద్దాం.

గత యుద్ధానంతరం ప్రధమ శతాబ్దములో చైనాలో జాతీయ విప్లవం వచ్చింది. దాదాపు దేశాన్ని ఐక్యపరచింది. సంయుక్త చైనా జాతి యొక్క స్వాతంత్ర్యాన్ని నెలకొల్పారు.

అద్భుతమైన జాతీయ చైతన్యం ఆ కాలంలో వచ్చింది. గత యుద్ధానంతరం వివిధ దేశాల విప్లవాల ప్రభావం చైనాలోకూడ కల్గింది. 1920 లో మొట్ట మొదటి సారిగా విద్యార్థులు ప్రదర్శనాలు గావించారు. 1920 లోనే బలోపేతమైన కార్మిక వుద్యమం బయలుదేరింది. కమ్యూనిష్టు పార్టీ ఏర్పడింది. చైనాను పంచుకోడానికి సామ్రాజ్యవాదులు గ్రుద్దులాడుకొనే సమయంలో, ఉత్తర చైనా మిలటరీ ప్రభువులు జపానుకో బ్రిటనుకో అప్పజెప్పాలనుకొనే రోజులలో, మహత్తరమైన జాతీయ వుద్యమం బయలుదేరింది. పారిశ్రామిక దాయల, మేధావుల పార్టీయైన కొమిన్—టాంగ్ పక్షమూ, కమ్యూనిస్టులూ, భూస్వామ్య ప్రభువులను పారద్రోలడానికి నిశ్చయించాయి. 1923 లో సన్‌యట్‌సేన్ కృషిఫలితంగా రెండు పక్షాలు సంయుక్త సంఘటనకు పూనాయి. ఈ రెండూకలిసి, క్వాంటంగ్ మిలటరీ ప్రభువుల తిరుగుబాటును కాంటన్‌లో అణచివేశాయి.

షాంగే, కాంటన్‌లలో విద్యార్థుల ఉద్యమం ప్రజ్వరిల్లింది. కాంటన్, హాంగ్‌కాంగ్‌లలో కార్మికుల సమ్మెలు విజృంభించాయి. పల్లెలలో భూస్వాముల వడ్డీ వ్యాపారస్థులను రైతులు నాశనంచేశారు. రైతు వుద్యమం అభివృద్ధిచెందింది. ఈ కాలంలో చైనా తన జాతీయ సైన్యాన్ని నిర్మించుకుంది. కాని ఈ చైనా విప్లవం పూర్తిఅయి స్థిరపడక ముందే, విదేశ సామ్రాజ్య వాదుల ప్రోత్సాహంవల్ల జాతీయ వుద్యమం చనిపోయింది. 1925 లో సన్‌యెట్‌సేను చనిపోయాడు. 1927 లో కుమిన్‌టాంగ్ కార్మిక కర్షకుల సపోర్టునువదలివేసి భూస్వాముల విదేశ పెట్టుబడిదారుల సహాయ మర్థించింది. కమ్యూనిష్టులను చిత్రవధగావించి, కమ్యూనిష్టు సైన్యాలను తరిమివేయ సాగింది.

1927 లో ఈ ఘటన తర్వాత పదియేండ్లు చైనా చరిత్ర మహా విషాదకరమైనది. జాతీయ శక్తులలోని చీలికల మూలంగా లాభించిం దెవరికి? విదేశ సామ్రాజ్యవాదులకు, జపాను సామ్రాజ్యవాదులు ఈ చీలిక నాధారంగా చేసుకొని చైనాపై బడ్డారు.

1931 లో మంచూరియాపై జపాను దాడిచేసి ఆక్రమించింది. మంచూరియా అపుడే అంతర్యుద్ధాలనుండి తలయెత్తి కియాంగ్సీ రాష్ట్రంలో నున్న కమ్యూనిష్టు రిపబ్లిక్‌పై దండయాత్ర ప్రారంభించ సాగింది. ఇంతలో జపాను దానిని ఆక్రమించింది.

1932 లో షాంగేపై బడ్డారు. జపానుకు లాభకరమైన సంధి జరిగింది. మరొకసారి చైనా లొంగిపోయే 'టాంగుకూ' సంధి జరిగింది. 1935 లో మరో అవమానకరమైన సంధి జరిగింది. హోపీ, చహార్ రాష్ట్రాలనుండి చీనా సైన్యాలు వెళ్ళగొట్టబడినాయి. 1935 జూన్‌లోని 'పేపింగ్' ఒడంబడిక, చీనా లొంగుబాటులలో ఆఖరిది.

చీనా లొంగిన కొలది దేశ భక్తులలో ఉద్రేకం హెచ్చింది. 1935 డిశంబరులో "జపాను సామ్రాజ్యవాదం నశించాలి" "జపానుతో పోరాడడానికి అంతర్యుద్ధం మానండి" అని గొప్ప గొప్ప విద్యార్థి ప్రదర్శనాలు జరిగాయి. ఆనాడు వారు తుపాకులకు, మెషిన్ గనులకు గురియైనా వారి త్యాగం వృధా కాలేదు. చైనా కమ్యూనిష్టు పార్టీ నాయకత్వాన రైతులు, కూలీలు "చైనావారు, చైనా వారితో పోరాడటం మానాలి" అనే నినాదము లేవదీశారు. సైనికులలో, ప్రజలలో జపానును ప్రతిఘటించాలనే చైతన్యం వృద్ధి అయింది. జపాను ఆక్రమిత పట్టణాలలో కార్మిక సమ్మెలు కూడ జరిగాయి. 1936 డిశంబరులో జంగ్—కై—షేక్‌ను అరెస్టుచేసి, అతని అనుచరులే జపానును యెదిరించవలసిన ఆవశ్యకత తెలియచేశారు. ఈ అరెస్టు సందర్భంలో కమ్యూనిష్టులు చాల జాగ్రత్తగా వ్యవహరించాతు. అసలు అరెస్టు చేయడమే తప్పన్నారు. కొందరు కోరినట్లుగా అతనిని చంపించక అతనిని విడుదల చేయాలని పట్టుబట్టారు. జపానును ఎదిరించాలనే తమ పట్టుదలను చూపెట్టారు, ఆనాటితో చీనా చరిత్ర మరొక దశలో ప్రారంభించింది.

1937 లో చీనాపై తన తుది యాత్ర సాగించదలచిన జపానుకు పెద్ద దెబ్బ తగిలింది. కమ్యూనిస్టు - జాతీయ వుద్యమాలకు సన్నిహిత ఐక్యత యేర్పడింది. చైనా కమ్యూనిస్టు సైన్యం జాతీయ సైన్యములో ఒక భాగ మయింది. ఈ జాతీయైక్యత ఒక మహా పర్వతంలాగా జపాను దాడి అలలను తరిమివేస్తోంది. నేటి ప్రపంచ స్వాతంత్ర్య సంగ్రామంలో ఒక భాగంగా మిళితమైపోయిన చైనా దేశభక్తిపూరిత యుద్ధం చైనా విముక్తికి దారి తీస్తుంది.

జపాను చైనా నాక్రమించుటలోని ఉద్దేశ్యం సర్వ విదితమే. చైనా 'రత్నగర్భ'లోని ఖనిజ సంపదలకోసమే అది యుద్ధం సాగించు తున్నది. కాని 'నూతన ఆసియాటిక్ విధానం' స్థాపించడానికి కాదు. ఇది చీనా ప్రజ తెరుగుదురు. కాబట్టే వాంగ్-చంగ్-వీ వంటి ద్రోహుల ప్రయత్నం ఫలించలేదు.

జపాను సామ్రాజ్య వాదులకు పెద్ద అధునిక యంత్రసామాగ్రి వుంది. నౌకా బలం విమానబలం వుంది. మంచి ఆయుధాలుగల సైన్యం వుంది. చైనాకివి అన్నీ లేకపోయినా ఇన్నాళ్ళలా నిల్వగల్గింది? 5 నెలలలో మలయా, ఇండోనేషియా, బర్మాలు ఎందుకు పడిపోయాయి? దానికి సమాధానం చైనా జాతీయ ఉద్యమంలో, కార్మిక కర్షక ఉద్యమంలో, జాతీయైక్యతలో, చైనా ప్రజల దేశభక్తిలో, తాము ప్రజాస్వాతంత్ర్యంకోసం పవిత్ర యుద్ధం జేస్తున్నామని చీనాసైనికులు భావించడంలోవుంది

వీర చైనా గత 5 ఏడ్లు జపానును అరికట్టుట ద్వారా, మనపై జపానుదాడిని ఆలస్యంచేసింది. మన యుద్ధం చీనా చేసింది. బర్మాలో తమ హద్దులనే గాక మన హద్దులను కూడ రంక్షించ పోరాడింది. అలాగే జపానును మనం ప్రతిఘటించితే వారికి మనం సహాయం చేసినవారమౌతాం. మనకు మనం సహాయం చేయుట ద్వారానే మనం చీనాకు సహాయంచేయగలం. చీనా ప్రజలతోపాటు నడుములు బిగించి ఈ పవిత్ర భూమిని రక్షించుకొనుటద్వారా, తమ విముక్తి ధర్మాన్ని నెరవేర్చాలి. మననినాదాలేమిటి?

జపాను దండయాత్రీకులను నశింపజేయాలి!

చీనా- భారత జనులు భాయీభాయీ అనాలి!

మాతృభూమి రక్షణకై జాతీయైక్యత కావాలి!

జాతీయ స్వాతంత్ర్యానికి జాతీయైక్యత గావాలి!

స్వతంత్ర ప్రపంచంలో స్వతంత్ర చైనా, స్వతంత్ర భారత్ తలయెత్తాలి!

గుంటూరు లాగుడుబండ్ల కార్మికుల సభ

ది 4—7—42 సాయంత్రం 6 గంటలకు గుంటూరు గాంధీపార్కులో కామ్రేడు కె. నాగయ్యగారి అధ్యక్షతక్రింద లాగుడు బండ్ల కార్మికుల సభ జరిగెను. కార్మికులు ఇతర ప్రజలు షుమారు వెయ్యిమంది వచ్చిరి. కామ్రేడ్ కొల్లా వెంకయ్య, కామ్రేడ్ కె. శీతారామయ్య, కామ్రేడ్ యస్. సత్యనారాయణ గార్లు, తినుబండారపు పదార్థముల ధరలు యెక్కువ కావడంవల్ల కార్మికులను భవించే కష్టాలను విపులముగా చెప్పుచూ ప్రభుత్వం, బీద కూలీల యొక్కయు, మధ్యతరగతుల యొక్కయు కష్టములు గమనించి వెంటనే ధరలను కంట్రోలు చేయుచూ, చౌక అంగళ్ళు పెట్టించి అమ్మించవలయునని కోరిరి.

ది 5-7—42 ఉదయం 8 గంటలకు పెద్ద బజారునుండి షుమారు 4 వేల, లాగుడుబండ్ల కార్మికులు, యితర కార్మికులు బీద ప్రజలు ఊరేగింపుతో ముఖ్యవీధులగుండాతిరిగి కలెక్టరు గారి వద్దకు వస్తువులధరలు కంట్రోలు చేయుటకును, చౌక డిపోలను పెట్టించి అమ్మించుటకును మహజరు తీసుకొనిపోయి నివేదించిరి. కలెక్టరుగారు చెప్పినది అంతయు విని ఆలోచించెదములేయని సమాధానము చెప్పిరి. కార్మికులు ప్రజలు ఎవ్వరూ యీ సమాధానానికి తృప్తిపడలేదు. వెంటనే వారంతా వెళ్ళి ఆదగ్గర మైదానంలో సభజరిపి తమకోర్కెలు బహిరంగ పరచారు.

ఆ రోజు మధ్యాహ్నము యెవరో కొందరు అరాచకవాదులు, దుండగీడులు, కొన్ని కొట్లలో బలాత్కారముగా ప్రవేశించి గుడ్డలను, యితరపదార్థములను కొల్లగొట్టిరి. ఈ లూటీకిని లాగుడు బండ్ల సంఘమునకును యెట్టి సంబంధము లేదు. ఈ లూటీ చర్యను నిరశించుటకును. లాగుడు బండ్ల కార్మిక సంఘంయొక్క ఉద్దేశమును విశదీకరించుటకును, ఆ సాయంత్రమే 6 గంటలకు పార్కులో బహిరంగ సభ జరిగెను. సభకు చాలమంది కార్మికులు, ఇతర ప్రజలు వచ్చిరి. కామ్రేడ్ కె. సీతారామయ్యగారు అధ్యక్షత వహించిరి. అధ్యక్షుడును, కామ్రేడ్ తిరుపతయ్యగారునూ మాట్లాడుచూ కార్మికుల యొక్కయూ, యితర బీద ప్రజల యొక్కయు ఆర్థిక బాధల గురించి మాట్లాడిన తర్వాత ఈ లూటీకినీ, లాగుడు బండ్ల సంఘమునకును యెట్టి సంబంధము లేదనియు, ఆ చర్య అరాజకవాదులు చేసినదనియు, సక్రమాందోళన ద్వారానే కార్మికులు తమ యిబ్బందులు తీర్చుకొందురే గాని అట్టి పనులు చేయరనియు చెప్పి కొందరిలో నున్న అపోహను తొలగించిరి.

కొమ్మినేని శీతారామయ్య,

కార్యదర్శి,

గుంటూరు లాగుడు బండ్ల కార్మికుల సంఘం

ఎట్టకేలకు సెబాస్టపోల్ పడిపోయింది. 8 నెలల అప్రతిమాన సాహసంతో సెబాస్టపోల్‌ను సోవియట్ వీరులు సంరక్షించారు. ముఖ్యంగా గత నాల్గు వారాలలో జరిపిన ప్రతిఘటన ప్రపంచాన్నంతటినీ దిగ్భ్రమ గలిగించింది. దాదాపు 3 లక్షల సైన్యం (20 డివిజన్లు) వేయి విమానాలు అహోరాత్రాలు పైబడ్డాయి. ప్రతి 5 గురు జర్మన్లకు ఒక్క రష్యను సైనికుడు చొప్పున యెదుర్కొనవలసి వచ్చింది. అయినా "ప్రవదా" చెప్పినట్లు సోవియటు భూమి ప్రతి అంగుళంకోసం అక్షరాలా తీవ్ర యుద్ధం చేశారు. లక్ష మంది జర్మను ఫాసిస్టు హంతకులను బలికొనిగాని సెబాస్టపోల్‌ను విడిచిపెట్టలేదు. సెబాస్టపోల్ పౌరులకు ప్రతివారికీ ఒక్కొక్క తుపాకి, ఒక్కొక్క గ్రెనేడ్ ఈయబడింది. సాధ్యమయినంతమంది జర్మన్లను హతమార్చి, జర్మను విజయాలను ఆలస్యం చేయాలనే పట్టుదలతో రష్యన్లు సాటిలేని శౌర్యంతో పోరాడారు. ఎట్టకేలకు సెబాస్టపోల్ పడిపోయింది.

సెబాస్టపోల్ పడిపోవడంతో క్రిమియా తీరమంతా నాజీలకు వశమయింది. కెర్చి జలసంధిని దాటి కాకేషియా నూనెగనులపై బడే ప్రయత్నం సులభ మవుతుంది. ఇంతేగాక నల్ల సముద్రంలోని సోవియటు నౌకాదళం ఇదివరలా స్వేచ్ఛగా విహరించడం కష్ట మవుతుంది. ఐనా నల్ల సముద్ర తూర్పుతీరంలోని రేవుల నుండి శత్రువులపై సోవియటు నౌకలు దెబ్బ తీస్తూనే వుంటాయి. ఒక్క సెబాస్టపోల్ పతనమే నాజీ సేనలను కాకాసస్ నూనెగనులకు తీసుకుపోదు. అదిసఫలం కావాలంటే ఖార్కోవ్ రంగంలో జర్మనులకు విజయం లభించాలి.

ఈవారం రష్యా—జర్మనీ ముఖ్య యుద్ధమంతా, ఖార్కొవ్, కుర్స్క్, బైలో గోరాడ్, వాల్చాన్స్క్ అను ప్రాంతాలలో జరిగింది. ఈ సంవత్సరం ఇంతటి తీవ్రయుద్ధం ఎచ్చటా జరిగియుండలేదు. హిట్లరు తన యావచ్ఛక్తినీ ఉపయోగించి ఇచట విజయాలను సాధించవలెనని ప్రయత్నించుతున్నాడు. నాజీ సైన్యాలే గాక, లక్షన్నర హంగేరియన్లు మరో లక్షన్నర (8 డివిజన్లు) రుమేనియన్లు రష్యన్ రంగానికి పంపబడ్డారు. రష్యన్ రంగంలో పాల్గొంటున్నవి కాని పాల్గొనడానికి ఆయత్తపరచబడినవి గాని టాంకుల మొత్తం 2000. దీనితో పోల్చి చూస్తే లిబియన్ రంగం ఏమంత పెద్దది కాదు. చర్చిల్ అంచనా ప్రకారమే జర్మన్లు 400 టాంకుల మాత్రమే లిబియలో ఉపయోగించారు. రష్యాలో క్రిందటి ఒక్క నెలలోనే సోవియట్ విమానదళం వెయ్యి జర్మన్ టాంకులను నాశనం చేసింది. తమ బలాన్నే హెచ్చుగా ఒక ప్రాంతంలో కేంద్రీకరించి అధిక సంఖ్యాబలంతో చొచ్చుకుపోవాలని ప్రయత్నం చేయడం జర్మన్ వ్యూహం. జర్మను ఆయుధ సంపత్తికి సైనికులకు విపరీత నష్టం కల్గించి, కొంత వెనుతగ్గినా, తర్వాత శత్రువు అలసిన పిమ్మట మీదపడటం రష్యన్ వ్యూహం.

యుద్ధ పర్యాలోకనం

కుర్స్క్ రంగంలో ఒక్కరోజునే 250 జర్మను టాంకులు 15000 ఆఫీసరులు సైనికులు చనిపోయారంటే అక్కడ ఎంతటి సంకులసమరం జరుగుతున్నదో చూడండి. కుర్స్క్, బైలో గోరాడ్, వాల్చాన్స్క్ రంగంలో కొన్ని చోట్ల జర్మనులు ఛేదించారు. రష్యనులు అక్కడక్కడ తిరుగుదాడి కూడా సలిపారు. కాని శత్రుసైన్యాల అధికసంఖ్యా బలం వలన రష్యనులు క్రిసుపద్ధతిని క్రొత్త స్థానాలకు వెళ్ళవలసి వచ్చింది.

జర్మనులు, మాస్కో-రాస్టావ్ రైలు మార్గాన్ని ఛేదించడానికి వొరోనెజ్‌ను పట్టుకొన విశ్వప్రయత్నం చేస్తున్నారు. రష్యన్‌లు డాన్ నదీ సంరక్షణకు పూనుకొన్నారు. అక్కడకు తమ సైన్యాలను కుర్స్క్-బైలోగొరాడ్‌ల నుండి రప్పించారు. డాన్‌నదీ యుద్ధం కూడ ప్రారంభమయింది. కుర్స్క్, బైలోగొరాడ్‌నుండి బయలుదేరిన జర్మనులు అడకత్తెరలో రష్యనులను పెట్టాలని కూడా చూస్తున్నారు. అయితే రష్యన్లు ఈ తిరోగమనం చూచి భయపడ నక్కఱలేదు. లండన్ టైమ్సు పత్రిక చెప్పినట్లు "రష్యన్ సైన్యాలు యెంత చేయడానికి వీలు వుంటుందో అంత నష్టాన్ని కల్గించనిదే ఒక్క మైలును కూడా అప్పజెప్పవు. ఇది అవినిత్యమూ చేస్తున్న పని."

డాన్, డానెట్జులను దాటనిదే కాకాషియన్ నూనె గనులపై బడటం అసాధ్యం. ఇప్పటి జర్మనీ వ్యూహం యిది. ఇపుడు డాన్ నదీ ప్రాంతాల యుద్ధం చేస్తున్న జర్మను సైన్యాలు టాగన్‌రాగ్ నుండి దక్షిణంగా బయలుదేరే జర్మను సైన్యాలను రోస్టావ్ ప్రాంతాలలో కలిసికోవడం.

ఈజిప్టు రంగం

పశ్చిమం నుండి బయలుదేరితే అక్షరాజ్యాల ఎడమపార్శ్వం రష్యారంగం, కుడిపార్శ్వం లిబియా, ఈజిప్టులు. ఈ రెండూ మధ్యప్రాచ్య ద్వారా కాకేషియా, ఇరాక్, ఇరానులలో గలపడం. ఇది జర్మన్ వ్యూహమని యిదివరకే చెప్పాము. ఇందులో ఎడమ పార్శ్వాన్ని గురించి పైన చెప్పాం. ఇక రెండవ పార్శ్వం విషయం తీసుకొందాం.

మెర్సామాట్రూ ఖాళీ చేసిన తర్వాత లిబియా—ఈజిప్టు రంగంలో యేమంత తీవ్రమైన మార్పు లేదు. జనరల్ ఆకిన్‌లెక్ స్వయంగా సైన్యాధిపత్యం వహించి బ్రిటిషు 8 వ సైన్యాన్ని నడుప నారంభించాడు. చేతికందిన ప్రతిదానిని పోవు చేసి ఎల్‌అలామిన్ వద్ద ప్రతిఘటించాడు. ఎల్ అలామిన్ వద్ద ఇరుపక్షాలూ నిలచిపోయాయి, ఎల్ అలామిన్‌కు నైరుతిగానున్న జనరల్ రోమెల్ సైన్యాలు ముందుకు రాలేదు.

లిబియా అపజయాలు బ్రిటిషు ప్రజలను కల్లోలపరిచాయి. పార్లమెంటులోని చర్చల ఫలితంగా తేలిన విషయం ఏమిటి? మిత్రమండలికి ఆ రంగంలో విమాన బలాధిక్యత వున్నా, దాదాపు తిరుగుదాడులకు సిద్ధంగా వున్న ఆకస్మిక పరాజయాలు సంభవించాయి. కారణం ఏసమయంలో, ఏ రంగంలో, ఏ రకపు ఆయుధాలను ఉపయోగించాలో వాటిని ఉపయోగించుకొనకుండుటయే. కామ్రేడ్ గలాచర్ చెప్పినట్లు, బ్రిటిష్ ప్రజలలో మిలటరీ నాయకత్వంపైన అవిశ్వాస భావం యేర్పడింది.

రష్యన్ రంగంతో పోల్చి చూస్తే లిబియా రంగం అంత పెద్దదికాదు. (ప్రాముఖ్యమైనదైనా) అక్షరాజ్యాల సైన్యాలు లక్షకంటె అధికం లేవు. టాంకులుకూడా దాదాపు400 ఉపయోగించారు.

దీనివలన తేలిన దేమిటంటే? హిట్లర్ తన సర్వస్వాన్ని రష్యన్ రంగంలోనే ఒడ్డుతున్నాడు. రష్యన్ రంగంలో ఓడిపోవడం అంటే, అది తన అంతిమ పరాజయమన్న సంగతి జర్మనీకి తెలుసు.

టర్కీకి ప్రమాదం

ఈజిప్టు యుద్ధరంగ ఫలితం టర్కీపై తగినంత ప్రభావం కలిగించుతుందని చర్చిలే అంగీకరించాడు: సెబాస్టపోల్ పతనంతో టర్కీ ఉత్తర తీరానికి విశేష ప్రమాదం సమీపించింది. ఇటు ఈజిప్టులో కూడ విజయం సంభవించితే టర్కీ పరిస్థితి యెలా వుంటుందో చెప్పలేము. సూయజ్ కెనాల్‌వద్ద తమ యావచ్ఛక్తినీ ఉపయోగించి మన సైన్యాలు యెదుర్కొంటాయని అక్షరాజ్యాలు తలచినపుడు తాము బాల్కన్ల మీదుగా టర్కీపై దండయాత్ర సలుపవచ్చు. కాని డాన్-దానెట్సు రంగంలో విజయంరానిదే యిక్కడకూడ యుద్ధానికి దిగడం గొప్ప జూదమే అవుతుంది. ఒకవేళ అట్టి యుద్ధాన్నే గనుక సాగించితే ఈజిప్టులోని యుద్ధం మన సైన్యాలకు మరో చోట పని గల్పించే యుద్ధంగా మాత్రమే వుంటుంది.

జర్మనుల ఈ ఉద్ధృతాన్ని తగ్గించడానికి ఒకే మార్గం వుంది. అది రెండవ రంగాన్ని ప్రారంభించడమే. సోవియటు పత్రిక లిదే కోరుచున్నాయి. బెవాన్ చెప్పినట్లు బ్రిటను తమకు బలం చాలదనే సంశయాన్ని వదలి రెండవ రంగాన్ని కల్పించాలి.

చైనా రంగం

ఇక అక్ష రాజ్యాల భాగస్వామియైన జపాను ప్రయత్నాలను చూద్దాం. చీనా జపాను యుద్ధంలో కూడా చెప్పదగిన మార్పులు లేవు. కాంటన్-హాంకో రైల్వే మార్గం అంతా వశం చేసుకోవాలని జపాను ప్రయత్నం జరుపు తున్నది. జపాను రైల్వే మార్గంలో చైనా కల్పించిన చీలికను పూడ్చాలని ప్రయత్నించుచున్నది. కాని ఒక చైనా మిలిటరీ నిపుణుడు చెప్పినట్లు దీనిని పూడ్చితే మరి కొన్ని చోట్ల 'చైనా' రైల్వే మార్గాన్ని ఛేదించుతుంది.

బర్మారోడ్డు పతనమయిన పిదప సోవియట్‌తో చైనాను కలిపేరోడ్డు ఒక్కటే బయటి ప్రపంచంతో చైనాను కల్పుతున్నది. దానిని కూడ తెగగొట్టాలనే జపాను ప్రయత్నం విఫలమయింది. కియాంగ్సి రాష్ట్రంలో, ఇహ్వాంగును జపాను ఆక్రమించుకొన్నది. దానిని చీనా తిరుగుదాడులతో పట్టుకుంది. చైనా యుద్ధవార్షిక సమయంలో ఇది చీనాకు విజయకానుక. ప్రాచ్యభాగంలో ఫాసిస్టు ఘాటినంతనూ ఒంటరిగా చైనా భరించుతోంది. అయిదు సంవత్సరాలు అకుంఠిత సాహసంతో జపాను నెదిర్చిన వీరచైనాకు మనం సహాయం చేయడం జపానుదాడికి ప్రజలను సన్నిద్ధపరచడమే. జపాను దాడి నెదుర్కొని మనకు మనం సహాయపరచుకోడమే చైనాకు మనం చేసే సహాయం కూడ అవుతుంది.

జిల్లాకలెక్టరువద్దకు

రైతుల రాయబారం

2—7—42 వ తేదీ పుదయం 11 గంటలకు శ్రీ కృష్ణాజిల్లా కలెక్టరుగారివద్దకు శ్రీ ముక్కామల నాగభూషణంగారు (జిల్లా రైతుసంఘ అధ్యక్షులు) అట్లూరు శ్రీమన్నారాయణ (గన్నవరం తాలూకా రైతు సంఘ కార్యదర్శి) శ్రీ గరిమళ్ళ వెంకటరత్నం గార్లు రైతు సమస్యలను గూర్చి రాయబారము వెళ్ళి కేసరపల్లి విమానాశ్రయానికి రైతులు బండ్లను బాడుగకు కట్టవలసిన విషయములలో, యివ్వవలసిన బాడుగలు, యెద్లు వుండుటకు పాకలను గురించిన్నీ, కృష్ణా ఈస్టర్న్ డెల్టాలో ఆయికట్టలో చేరని భూములను ఆయకట్టలో చేర్చుటను గురించిన్నీ మొదలైన విషయములమీద విశదముగా మాట్లాడగా దానిమీద కలెక్టరుగారు కేసరపల్లి విమానాశ్రయంవద్ద బాడుగ బండ్ల యెద్దులకు పాకలు వేయించెదమనియు, ఆయకట్టలో చేరవలసిన భూములకు పిటీషనులు పంపితే వెంటనే వుత్తర్వుల జారీ చేసెదమనియు సమాధానము చెప్పినారు.

కావున డెల్టా యేరియాలలోని రైతులందరూ తమ భూములను ఆయకట్టలో చేర్పించుకొనుటకు యీ అవకాశమును వినియోగించ వలసినదిగా కోరుచున్నాం.

అట్లూరు శ్రీమన్నారాయణ,
కార్యదర్శి.

Edited and Published by Katragadda Rajagopala Rao and Printed by The Popular Printers, Bezwada.

END OF ISSUE